

కొక్కంటిని కమ్మేసిన పొగమంచు

మంచు పరదా..!

తెలతెలవారుతున్నా..
మంచు తెరలు తొలగలేదు.
బారెడు పొద్దెక్కినా..
భానుడి కిరణ స్పర్శ తగలలేదు.
తెరలు తెరలుగా కమ్మేసిన
పొగ మంచు దుప్పటిలో
దారి తెన్ను తెలియక
శ్రమైక జీవులు కాస్త కష్ట పడ్డారు.
బిగదీసుకున్న దేహానికి కొందరు
చలిమంట వేడితో సాంత్వన చేకూర్చారు.



చలిమంటలు వేసుకున్న ద్విచక్రవాహనదారులు

తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్‌ను శనివారం ఉదయం మంచు కమ్మేసింది. ఉదయం 8గంటలైనా సూర్యుడు కనిపించక వాహనదారులు ఇబ్బంది పడ్డారు. కొందరు చలిమంట వేసుకుని ఉపశమనం పొందారు.

-ఆంధ్రజ్యోతి, తనకల్లు





40 వేలు బోగస్..!

వైసీపీ హయాంలో ఇష్టారాజ్యం

- కుప్పలు తెప్పలుగా బోగస్ జాబ్‌కార్డులు
- ఆరేళ్లలో కోట్ల ప్రజాధనం లూటీ
- ఈకేవైసీతో వెలుగులోకి వస్తున్న వైనం

40 వేల జాబ్‌కార్డులు రద్దు

ఉపాధి కూలీల ఈకేవైసీ మొదలు పెట్టిన వెంటనే జిల్లాలో బోగస్ జాబ్‌కార్డుదారులు, కూలీలు కుప్పలుతెప్పలుగా బయటపడ్డారు. జిల్లాలో 40 వేల బోగస్ జాబ్‌కార్డులు రద్దు చేశారు. అలాగే 1,08,033 మంది నకిలీ కూలీలను గుర్తించి, తొలగించారు. గతంలో జిల్లాలో 2.45 లక్షల జాబ్‌కార్డులు ఉండగా.. ఈకేవైసీ తరువాత 2,03,145 కార్డులు మిగిలాయి. ఈకేవైసీ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని బోగస్ జాబ్‌కార్డులు వెలుగులోకి వస్తాయి.

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నది బహిరంగ రహస్యమే. అన్నింటా అక్రమాల పరంపర కొనసాగించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అంతే లేదన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఎక్కడో ఉన్నవారికి కూడా ఇక్కడ జాబ్‌కార్డులు సృష్టించి, ప్రజాధనం లూటీ చేశారు. ప్రస్తుతం ఈకేవేసీ ప్రక్రియ చేపట్టడంతో ఆ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఉపాధి హామీలో వేల సంఖ్యలో బోగస్ జాబ్‌కార్డులు బయట పడుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అడ్డగోలుగా జాబ్‌కార్డులు జారీ చేసి, పనులకు వెళ్లకపోయినా.. వెళ్లినట్లు నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డ్వామా అధికారులు, సిబ్బంది కుమ్మక్కై, దొంగ మస్టర్లతో కోట్ల రూపాయల ప్రజాధనం దిగమింగారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఏడాదికిపైగా ఈ ఉపాధి అక్రమాలు కొనసాగడం గమనార్హం. ఉపాధి పనుల్లో ఈ బోగస్ జాబ్‌కార్డుల అక్రమాలకు చెక్ పెట్టడానికి ప్రభుత్వం తాజాగా ఉపాధి కూలీల ఈకేవైసీ చేపట్టింది. దీంతో పనులకు వెళ్లకుండా వెళ్లినట్లు దొంగ మస్టర్లతో ఉపాధి సొమ్ము అప్పనంగా మింగుతున్న వారి ఆటలకు చెక్ పడుతోంది.

82.56 శాతం ఈకేవైసీ పూర్తి



జిల్లాలో ఇప్పటివరకు 82.56 శాతం మంది ఉపాధి కూలీలకు ఈకేవైసీ పూర్తి చేశాం. జిల్లాలో 3,50,062 మంది కూలీలు ఉన్నారు. వారిలో 2,89,027 మందికి ఈకేవైసీ చేశాం. ఇంకా 61,035 మందికి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. నూతనంగా 1,926 జాబ్‌కార్డులు మంజూరు చేశాం. ఇకపై ఉపాధి పనికి వెళ్తేనే కూలి డబ్బులు అకౌంట్‌లో జమవుతాయి. ఉపాధి హామీ సిబ్బంది అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

- విజయప్రసాద్, డ్వామా పీడీ, శ్రీసత్యసాయి జిల్లా

వీళ్లు తేడా..!

ప్రమోషన్ వద్దంట.. పంచాయతీ కార్యదర్శిగానే ఉంటారంట..

- డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి
- కార్యదర్శులుగా కొనసాగతామంటూ పట్టు



ప్రమోషన్ అంటే.. ఉద్యోగులు ఎగిరి గంతేస్తారు. వస్తే.. పార్టీ చేసుకుంటారు. అన్యాయం చేస్తే.. న్యాయ పోరాటం కూడా చేస్తారు. పంచాయతీ కార్యదర్శులు మాత్రం అందుకు రివర్స్. ప్రమోషన్ ఇస్తుంటే.. వద్దంటున్నారు. కార్యదర్శిగానే కొనసాగుతామని పట్టుబడుతున్నారు. వీరి తీరుతో ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యపోతున్నారు.

హిందూపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పలువరు సీనియర్ పంచాయతీ కార్యదర్శులు.. ప్రమోషన్ వద్దంటున్నారు. ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి వచ్చినా.. పంచాయతీ కార్యదర్శిపైనే మోజుపడుతున్నారు. ఇందుకోసం నాయకులు, ఉన్నతాధికారులతో పైరవీలు చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలు సైతం బేఖాతరు చేస్తున్నారు. ప్రమోషన్ కంటే పంచాయతీ కార్యదర్శిపైనే వారు మోజుగా ఉండడం వెనుక కథేంటో వారికే తెలియాలి.

ఉద్యోగోన్నతి వద్దనుకుని..

జిల్లాలో ఇటీవల ఏడుగురు పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి కల్పించారు. వారిలో ఒకరిద్దరు డిప్యూటీ ఎంపీడీఓలుగా వెళ్లారు. వారున్న పంచాయతీల్లోనే తిష్టవేసి కూర్చుంటున్నారు. చిలమత్తూరు మండలంలో ఓ కార్యదర్శికి ఉద్యోగోన్నతి రాగా.. ఇప్పటికీ ఆయన పంచాయతీ కార్యదర్శిగా రిలీవ్ కాలేదు. మండలస్థాయి అధికారులు చెప్పినా బేఖాతరు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి కోసం నాయకులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. హిందూపురంలోని ఓ మేజర్ పంచాయతీ కార్యదర్శికి డిప్యూటీ ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి వచ్చింది. అదికూడా హిందూపురం మండలంలోనే డిప్యూటీ ఎంపీడీఓగా ఉండేలా ఆదేశాలు ఇచ్చారు. ఆయన రిలీవ్ అయి డిప్యూటీ ఎంపీడీఓగా చేరినా.. కార్యదర్శి పోస్టు కావాలని పట్టుబడుతున్నారు. దీనిపై సదరు ఉద్యోగోన్నతి పొందిన అధికారి.. నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నట్లు తెలిసింది. ఓడీసీ మండలంలో కూడా ఓ కార్యదర్శికి పదోన్నతి రాగా.. ఆయన కూడా డిప్యూటీ ఎంపీడీఓ అనువైన మండలం దొరకలేదని అక్కడే ఉంటున్నాడు. మరో రెండు మండలాల్లో సైతం కార్యదర్శులు ప్రమోషన్ వచ్చినా వెళ్లలేదు.



కార్యదర్శులుగానే ఉంటాం..

డిప్యూటీ ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి వచ్చినా పంచాయతీ కార్యదర్శులుగానే పనిచేస్తామంటూ పట్టుబడుతుండడం గమనార్హం. గతంలో కూడా కొంతమందికి డిప్యూటీ ఎంపీడీఓ ఉద్యోగోన్నతి వచ్చినా వద్దనుకుని పంచాయతీ కార్యదర్శులుగానే కొనసాగుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం వారు పనిచేసేది మేజర్ పంచాయతీలు కావడమే. ఆ పంచాయతీల్లో ఆదాయాలు బాగా ఉండటమే కారణమని ఉన్నతాధికారులే పేర్కొంటున్నారనంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కూటమి అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు సానుకూల పవనాలు వీస్తున్నాయి. దీంతో డిప్యూటీ ఎంపీడీఓగా ఉద్యోగోన్నతిపై వెళ్తే ఆదాయం ఉండదనే వారు వెనకడుగు వేస్తున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా కలెక్టర్ ఆదేశాలను అనుసరిస్తారా.. నాయకులతో కుమ్మక్కై పంచాయతీల్లోనే కొనసాగుతారా అన్నది తేలాల్సి ఉంది.

మహమ్మారి భయం

- కలవరపెడుతున్న స్క్రబ్ టైఫస్
- పురంలో బ్యాక్టీరియా వ్యాప్తి?
- ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు



హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో స్క్రబ్ టైఫస్ వ్యాధికి ప్రత్యేక వార్డు, చిన్నారి శరీరంపై ఉన్న పుండు

హిందూపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్తగా వ్యాపిస్తున్న స్క్రబ్‌టైఫస్ అనే వ్యాధి ప్రజలను కలవర పెడుతోంది. ఇన్ని రోజులు ఎక్కడో ఉందిలే అని ఉదాసీనంగా ఉన్న జిల్లా ప్రజలు హిందూపురంలో అనుమానిత కేసులు రావడంతో బెంబేలెత్తిపోతున్నారు. స్క్రబ్‌టైఫస్ లక్షణాలతో ఇద్దరు, ముగ్గురు (మిగతా 6లో..)

తుంగభద్రతకు చర్యలు

టీబీ డ్యాం గేట్ల ఏర్పాటుకు శ్రీకారం

- ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించిన బోర్డు అధికారులు
- నూతనంగా 33 గేట్లు అమరిక
- ఏపీ వాటా రూ.20 కోట్లు విడుదల
- నిధులివ్వని కర్ణాటక ప్రభుత్వం
- జపాన్ నుంచి బేరింగుల దిగుమతి
- 2026 జూన్ ఆఖరికి పనులు పూర్తయ్యేలా ప్లాన్

తుంగభద్ర డ్యాం నూతన గేట్లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. టీబీపీ బోర్డు అధికారులు ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. కాంట్రాక్ట్ సంస్థ పాత గేట్లు తొలగించే పనులకు అంకురార్పణ చేశారు. రూ.44 కోట్లతో చేపట్టే పనులను గుజరాత్‌కు చెందిన హార్డ్‌వేర్ అండ్ టూల్స్ సంస్థ చేపట్టింది. ఎట్టి పరిస్థితుల్లో 2026 జూన్ ఆఖరులోగా గేట్లు అమరిక పూర్తి చేసేందుకు బోర్డు ఇంజనీర్లు పక్కా ప్రణాళిక తయారు చేశారు. దీంతో జనవరి 11 వరకు సాగులో ఉన్న పంటలకు సాగునీరు ఇచ్చి ఆ తరువాత అవసరాన్ని బట్టి తాగునీరు మాత్రమే ఇస్తామని తేల్చి చెప్పారు. గేట్ల ఏర్పాటు కోసం ఆంధ్రప్రదేశ్ వాటా నిధులు రూ.20 కోట్లు విడుదల చేసింది. కర్ణాటక వాటా నిధులు విడుదల చేయాల్సి ఉంది.

(వివరాలు 6వ పేజీలో...)



తుంగభద్ర డ్యాం పాత గేటు తొలగిస్తున్న కార్మికుడు

బరితెగిస్తున్న బైక్ వీలర్స్

హైవేపై ప్రమాదకర విన్యాసాలు

రోడ్డులో వీలర్స్ విన్యాసాలు





రెచ్చిపోతున్న యువతీయువకులు

- కత్తులతో రోడ్డుపై నిప్పురవ్వలు రేపుతున్న వైనం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- బాబయ్య ఉరుసు సందర్భంగా పలు బైక్‌ల సీజ్

కత్తులతో విన్యాసాలు చేస్తూ వెళ్తున్న వీలర్స్

సోమందేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బైకర్స్ బరితెగిస్తున్నారు. హైవేపై ప్రమాదకర విన్యాసాలు చేస్తూ వాహనదారులను బెంబేలెత్తిస్తున్నారు. ముందు చక్రాన్ని గాల్లోకి లేపి యువకులు బైకు నడుపుతుండగా, వెనుక కూర్చున్న యువతులు కత్తులు తీసి వెనక్కు వంగి దాన్ని రోడ్డుపై రాపాడిస్తూ నిప్పురవ్వలు రేగేలా చేస్తున్నారు. మూడు రోజుల కిందట పెనుకొండ సమీపంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్‌గా మారింది.

పెనుకొండ, సోమందేపల్లి మధ్యలో...

ప్రస్తుతం పెనుకొండలో బాబయ్య ఉరుసు జరుగుతోంది. ఈనెల 2న గంధం వేడుకలను వీక్షించడానికి సుదూర ప్రాంతాల నుంచి వేలమంది భక్తులు తరలివచ్చారు. వీరితోపాటు పలువురు ఆకతాయిలు కూడా వచ్చారు. సోమందేపల్లి నుంచి పెనుకొండ వరకు జాతీయరహదారిపై వీలింగ్ చేస్తున్న 106మందిని పోలీసులు పట్టుకుని, వాహనాలను సీజ్‌చేశారు. అదేరోజు రాత్రి చిక్కబళ్లాపురం, గౌరీబిదనూరుకు చెందిన కొన్ని జంటలు పెనుకొండ, సోమందేపల్లి (మిగతా 6వ పేజీలో...)

వామ్మో.. విల్ట్

- సొళ్లకు సొళ్లు ఎండిపోతున్న మిరప పైరు
- రూ.లక్షల్లో నష్టపోతున్న అన్నదాతలు



జనార్దనపల్లి వద్ద ఎర్రగా మారి ఎండిన డబ్బీ రకం కాయలు

విడపనకల్లు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): విల్ట్ (వేరుకుళ్లు) తెగులుతో మిరప రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత ఏడాది అధిక వర్షాల వల్ల మిరప పైరు కుళ్లి, ఎండిపోయింది. దీంతో రైతులకు ఆశించిన మేర దిగుబడి రాలేదు. వచ్చిన దిగుబడికి కూడా గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉంచారు. తెగుళ్లు, ధరలు లేకపోవడంతో ఈఏడాది మండల వ్యాప్తంగా మిరప సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. గత ఏడాది దాదాపు 22వేల ఎకరాల్లో సాగు చేయగా అది ఈ ఏడాది 10 వేల ఎకరాలకే పరిమితమైంది.

సొళ్లకు సొళ్లు...

ఈ ఏడాది కూడా మిరప రైతులకు కష్టాలు తప్పడం లేదు. గత నెలలో అధిక వర్షాలు రావటం, కొంత మంది రైతులు అధికంగా నీటి తడులు ఇవ్వటంతో వేరుకుళ్లు తెగులు సోకి సొళ్లకు సొళ్లు ఎండిపోతున్నాయి. జూన్‌లో సాగు చేసిన మిరప పంటలో

(మిగతా 6లో...)

అలరించిన సంగీత విభావరి

6



టార్గెట్ 50 టీఎంసీలు

- హంద్రీనీవాలోకి రికార్డు పంపింగ్
- ఫిబ్రవరి మాసాంతానికి ఆగనున్న ఎత్తిపోతలు
- ఆలోపే లక్ష్యం సాధించాలంటున్న అధికారులు



కాలువ నిండుగా ప్రవహిస్తున్న నీరు

గుంతకల్లు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో యాభై టీఎంసీల నీటిని పారించే రికార్డు లక్ష్యంతో పంపింగ్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటిదాకా దాదాపు 31.3 టీఎంసీల సాగునీటిని హంద్రీనీవాలోకి ఎత్తిపోశారు. అదే సగటున పంపింగ్ సాగితే ఫిబ్రవరికల్లా 52 టీఎంసీల నీటిని పారించవచ్చని ఇరిగేషన్ అధికారులు అంచనా వేశారు. అదే జరిగితే హంద్రీనీవా వైడెనింగ్ లక్ష్యం తొలి సంవత్సరమే నెరవేరినట్లవుతుంది. వైడెనింగ్ పనులు ఇంకా మిగిలి ఉన్నందున ఈ సంవత్సరం కాస్త ముందుగానే హంద్రీనీవాలో ఎత్తిపోతలు (మిగతా 6వ పేజీలో..)

హోంగార్డుల సేవలు ప్రశంసనీయం

ఎస్పీ సతీష్‌కుమార్



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసులతో సమానంగా పౌర సమాజానికి సేవ చేస్తున్న హోంగార్డుల సేవలు ప్రశంసనీయమని ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో శనివారం 63వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ డ్రైవర్లు, ట్రాఫిక్ రెగ్యులేషన్, నేరాల నియంత్రణ, కంప్యూటర్ ఆపరేటింగ్, శాంతిభద్రతల పర్యవేక్షణ, నేరాలను అరికట్టడంలో పోలీసులకు వెన్నుదన్నుగా హోంగార్డులు ఉంటున్నారన్నారు. జిల్లాలో ప్రస్తుతం 305 మంది హోంగార్డులు పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ఫిట్నెస్ కలిగి ఉండి, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. హోంగార్డులకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానన్నారు. హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు ఎస్పీ బహుమతులను అందజేశారు. కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు మహేశ్, వలి ఆర్ఎస్సైలను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ శివాంజనేయులు, ఆర్ఐలు వలి, ఆర్ఎస్సైలు ప్రసాద్, హోంగార్డు ఇన్‌చార్జ్ రామాంజనేయులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పదింతల శ్రద్ధ

పదిలో ఉత్తమ ఫలితాల కోసం 100 రోజుల ప్రణాళిక

- శనివారం నుంచే అమలుకు శ్రీకారం
- పర్యవేక్షణకు జిల్లా, మండల కమిటీలు
- డీఈఓ, డిప్యూటీ డీఈఓలు దిశానిర్దేశం


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచడానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేయనున్నారు. జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు 356 ఉన్నాయి. ఇందులో 19616మంది పదో తరగతి చదువుతున్నారు. వీరిలో బాలురు 9311మంది, బాలికలు 10305మంది ఉన్నారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు టెన్త్ విద్యార్థులకు వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. సబ్జెక్టులవారిగా షెడ్యూల్ రూపొందించి విడుదల చేశారు. వచ్చే ఏడాది మార్చి 16నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీంతో వచ్చే మార్చి 15వరకు ప్రత్యేక ప్రణాళికకు షెడ్యూల్ తయారు చేశారు. ఆ మేరకు శనివారం నుంచి టెన్త్ 100 రోజుల ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. ఉదయం 8 నుంచి 9గంటల వరకు, మధ్నాహ్నం 2-30 నుంచి 4గంటల వరకు చదివించడం, ఆతర్వాత ఆ సబ్జెక్టుకు సంబంధించిన పరీక్షను సాయంత్రం 4 నుంచి 5గంటలలోగా నిర్వహించాలి. అక్కడే ఆ జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి, ఎవరెవరికి ఎన్నిమార్కులు వచ్చాయో కూడా లీప్‌యాప్‌లో సాయంత్రం 5గంటలలోపే నమోదు చేయాలి.

పర్యవేక్షణకు కమిటీలు

పదో తరగతి వందరోజుల ప్రత్యేక ప్రణాళిక సక్రమంగా అమలు జరగడం కోసం పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయి అకడమిక్ ఫోరమ్స్ ఏర్పాటు చేశారు. ఆయా సబ్జెక్టు టీచర్లతో వీటిని ఏర్పాటు చేశారు. ఇలా ప్రతి సబ్జెక్టుకు నలుగురు టీచర్లు చొప్పున జిల్లా, మండలస్థాయి కమిటీలు ఏర్పాటు చేశారు. ఈకమిటీ సభ్యులు వారానికి రెండు రోజులు పాటు జిల్లాలో పర్యటిస్తూ ఉన్నత పాఠశాలలో ప్రణాళిక అమలు తీరు, విద్యార్థుల ప్రగతిపై అంచనా వేస్తూ, ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు అందిస్తారు. ఈ నేపథ్యంలో పర్యవేక్షణ ఫోరమ్ కమిటీసభ్యులకు జిల్లాకేంద్రంలోని ఉపాధ్యాయభవన్‌లో జిల్లా పరీక్షల విభాగం ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఉత్తమ ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యల గురించి డీఈఓ ప్రసాద్‌బాబు, డిప్యూటీ డీఈఓలు మల్లారెడ్డి, శ్రీనివాసరావులు హితబోధచేశారు. పరీక్షల విభాగాధిపతి వెంకటేశులు, డీసీఈబీ సెక్రటరీ గంధం శ్రీనివాసులు, ఎంఈఓలు క్రిష్టయ్య, గురుప్రసాద్, రామాంజినేయులు, ఏఎంఓ వేణుగోపాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సెలవురోజుల్లోనూ మధ్యాహ్న భోజనం

పదో తరగతి వంద రోజుల ప్రణాళికను రెండో శనివారం, ఆదివారాలు, ఇతరత్ర సెలవు దినాల్లో కూడా అమలు చేస్తారు. దీంతో ప్రణాళిక అమలవుతున్న అన్ని పాఠశాలల్లో మధ్నాహ్న భోజనం అమలు చేయాలని విద్యాశాఖ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పిల్లల ప్రగతి చూడాలి: శ్రీనివాసులు, డిప్యూటీ డీఈఓ

పర్యవేక్షణ కమిటీ సభ్యులు పాఠశాలలకు వెళ్లినపుడు అక్కడ అన్ని తరగతుల పిల్లల ప్రగతిని చూడాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాపథకాలు అమలు చూడాలి. పదోతరగతి విద్యార్థుల విషయంలో సబ్జెక్టుల వారీగా ప్రగతి పరిశీలించాలి. సింగిల్ సబ్జెక్టులో వెనుకబడి ఉన్న వారిని గుర్తించి, వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అపుడే రిజల్ట్స్ మెరుగవుతాయి.

టీచర్లపై పెత్తనం చేయొద్దు: మల్లారెడ్డి, డిప్యూటీ డీఈఓ

మనం పర్యవేక్షణ కమిటీ సభ్యులమని పాఠశాలలకు వెళ్లినపుడు టీచర్లపై పెత్తనం చేయకండి. ఆయా పాఠశాలల్లో గుర్తించిన లోపాలను సంబంధిత టీచర్లతో ఆప్యాయంగా మాట్లాడి, సరిదిద్దండి. ఫలితాల శాతం పెరుగుతుందని చెబుతూ టీచర్లను ఇన్‌స్పైర్‌చేయాలి. అపుడు అనుకున్న ప్రణాళిక మేరకు మంచి ఫలితాలు వస్తాయి.

మెరుగైన ఫలితాల సాధనకు..: ప్రసాద్‌బాబు, డీఈఓ

పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో జిల్లాలో ఉత్తమ ఫలితాల సాధనకు అందరూ సమష్టిగా కృషిచేయాలి. పర్యవేక్షణకు వెళ్లినపుడు కమిటీ సభ్యులు అన్ని విషయాలను పరిశీలించాలి. సమాచారం పక్కాగా నమోదు చేసుకొని, అక్కడ ఉత్తీర్ణత పెంచడానికి తగిన సలహాలు ఇవ్వాలి. అందరూ సమన్వయంతో సాగాలి.

టార్గెట్ 50 టీఎంసీలు

(5వ పేజీ తరువాయి)

నిలిచిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి మాసాంతానికి నీటి పారుదల లక్ష్యాన్ని అధిగమిస్తే శ్రీశైలం డ్యాంలో తగినన్ని నీటి నిల్వలు ఉన్నా కూడా హంద్రీనీవాకు ఎత్తిపోతలు నిలిపివేయనున్నట్లు సమాచారం.

నాలుగు రోజులకో టీఎంసీ

హంద్రీనీవాలో ఈ సీజన్‌లో జూలై 22 నుంచి మల్యాల వద్ద ఎత్తిపోతల కార్యక్రమాన్ని ప్రారంభించారు. గడచిన 137 రోజుల్లో సాంకేతిక సమస్యల కారణంగా పంపింగ్‌లో రెండు రోజులు అంతరాయం ఏర్పడింది. మిగిలిన 135 రోజుల్లో 31.3 టీఎంసీల నీటిని మల్యాల వద్ద హంద్రీనీవాలోకి ఎత్తిపోశారు. ఇందులో జిల్లాలోకి 28.5 టీఎంసీల నీరు రాగా, 2.8 టీఎంసీల నీరు కర్నూలు జిల్లాలో వినియోగించుకున్నారు. ప్రస్తుతం మల్యాల పంపు హౌస్‌లో ఏడు పంపులతో నీటిని తోడుతుండగా, 2,839 క్యూసెక్కుల నీరు పారుతోంది. జిల్లాలోని రాగులపాడు 8వ పంపు హౌస్‌లో 2,600 క్యూసెక్కుల నీటిని ఎగువకు జీడిపల్లి రిజర్వాయరు వైపునకు ఎత్తిపోస్తున్నారు. అలాగే జీడిపల్లి రిజర్వాయరు నుంచి 2వ దశ హంద్రీనీవా కాల్వలో 2,540 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఈ లెక్కలను అనుసరించి దాదాపు నాలుగు రోజులకు ఒక టీఎంసీ చొప్పున హంద్రీనీవాలో పారిస్తున్నారు. ఇదే తీరున పంపింగ్ కొనసాగితే ఫిబ్రవరి మాసాంతానికి.. అంటే మరో 82 రోజుల్లో 21 టీఎంసీల నీరు హంద్రీనీవాకు దక్కుతుంది. వెరసి 52 టీఎంసీల నీరు ఈ సీజన్‌లో హంద్రీనీవాలో పారించినట్లవుతుంది. కాలువ లైనింగ్ చేయక మునుపు సగటున 7 రోజులకు ఒక టీఎంసీ లేదా అంతకంటే తక్కువ నీరు హంద్రీనీవాలో పారింది.

ఎత్తిపోతలు ఫిబ్రవరి వరకేనా?

ఈ సంవత్సరం వర్షాలు పుష్కలంగా కురవడంతో శ్రీశైలం డ్యాంలో ప్రస్తుతం 92 శాతం నీటి నిల్వలు ఉన్నాయి. డ్యాంలోకి ఆరున్నర వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, దాదాపు అంతే మోతాదులో ఔట్‌ఫ్లో ఉంది. డ్యాంలో 881.5 అడుగుల నీటి మట్టం ఉండగా, వాటర్ లెవెల్ 835 అడుగుల వరకూ మల్యాల వద్ద పంపింగ్ సాధ్యపడుతుంది. ఏప్రిల్ వరకూ ఔట్‌ఫ్లోని పెంచకుండా నిరంతరాయంగా హంద్రీనీవా, కేసీ కెనాల్ ప్రాజెక్టులకు నీటిని వినియోగించినా కూడా డ్యాంలో నిల్వలు కనిష్ఠానికి చేరవు. కానీ డ్యాంలో నీటి నిల్వలు తగినన్ని ఉన్నా, ఫిబ్రవరి మాసాంతానికి హంద్రీనీవాలో పంపింగ్ ఆగే పరిస్థితులు ఉన్నాయి. హంద్రీనీవా లైనింగ్ పనులు మరో పది శాతం మిగిలి ఉండటంతో ఈ సీజన్‌లో నీటి పారుదల ఫిబ్రవరి చివరికల్లా ఆపేసి డీప్‌కట్‌లో ఎర్త్ వర్కులు, పెండింగ్ లైనింగ్ పనులు చేసే ఉద్దేశ్యంతో అధికారులున్నారు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పలుచోట్ల డీప్‌కట్ కెనాల్‌లో ఎర్త్ వర్కులు మిగిలి ఉన్నాయి. అలాగే జిల్లాలోని బుగ్గసంగాల, కసాపురం, జీ కొట్టాల, వీసీ ప్యాపిలి, కౌకుంట్ల, వై రాంపురం గ్రామాల వద్ద హంద్రీనీవాలో మట్టికట్టలు, వంతెనల వద్ద లైనింగ్ పనులు పెండింగులో ఉన్నాయి. మార్చిలో ఆ పనులను చేపట్టి తర్వాత సీజన్‌లోపు పూర్తిచేసే లక్ష్యంతో అధికారులు ఉన్నారు.

50 టీఎంసీల నీటిని పారిస్తాం



హంద్రీనీవాలో ప్రస్తుతం జరుగుతున్న ఎత్తిపోతలను కొనసాగించి ఫిబ్రవరి మాసాంతానికల్లా 50 టీఎంసీలను దాటి నీటిని పారిస్తాం. ప్రభుత్వం ఎత్తిపోతలను నిలిపివేయాలని ఆదేశించేలోపే టార్గెట్‌ను పూర్తిచేసే ఉద్దేశ్యంతో ఎత్తిపోతలు, నీటి పారుదలలో అంతరాయాలు ఏర్పడకుండా కాల్వపై పర్యటించి జాగ్రత్తలు తీసుకుంటున్నాం. గత సీజన్‌లో డ్యాంలో దండిగా నీరు ఉన్నాసరే, భవిష్యత్తు అవసరాల కోసం ప్రభుత్వం రిజర్వాయరులో పెద్ద మోతాదులో నీటిని నిల్వ ఉంచడం కోసం హంద్రీనీవాకు పంపింగ్‌ను నిలిపివేసింది. ఈసారి కూడా అలా జరగవచ్చని భావిస్తున్నాం. అందుకే ఫిబ్రవరి మాసాంతంలోపే టార్గెట్‌ను అధిగమిస్తాం. కాల్వలో నీటి పారుదల ఆగిన వెంటనే పెండింగ్ లైనింగ్ పనులను ప్రారంభిస్తాం.

-శ్రీనివాస నాయక్, హంద్రీనీవా గుంతకల్లు ఏరియా ఈఈ

అలరించిన సంగీత విభావరి

పుట్టపర్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రష్యా భక్తులు చేపట్టిన సంగీత విభావరి అలరించింది. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ హాలులో శనివారం రాత్రి రష్యా భక్తులు సంగీత కచేరి నిర్వహించారు. ఆ దేశ సంప్రదాయ రీతిలో చేపట్టిన సంగీతగానం భక్తులను తన్మయత్వం చేసింది. గంటపాటు సత్యసాయి ప్రేమతత్వంపై భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.




పాటలు పాడుతున్న రష్యా భక్తులు

తుంగభద్రతకు చర్యలు

బళ్లారి/కర్నూలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల ప్రధాన నీటి ఆధారమైన తుంగభద్ర డ్యాం నూతన గేట్లు ఏర్పాటుకు టీబీపీ బోర్డు అధికారులు సన్నాహాలు చేపట్టారు. డ్యాంకు మొత్తం 33 క్రస్ట్‌గేట్లు గేట్లు ఉన్నాయి. గతేడాది ఆగస్టులో 19వ నంబరు గేటు కొట్టుకుపోవడంతో డ్యాం భద్రతపై పలు అనుమానాలు తలెత్తాయి. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ), డ్యాంను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన ఏకే బజాజ్ కమిటీ సిఫార్సుల మేరకు గేట్లు, ప్రాజెక్టు సామర్థ్యంపై టీబీపీ బోర్డు అధ్యయనం చేయిచింది. గేట్ల సామర్థ్యం నిర్ధారణ, రేడియోగ్రఫీ, ఎంపీటీ, అల్ట్రా సోనిక్, డీపీటీలో అనుభవం, నైపుణ్యం కలిగిన కేఎస్ఎన్‌డీటీ సర్వీసెస్ సంస్థ అధ్యయనం చేసింది. 2024 ఆగస్టులో కొట్టుకుపోయిన 19వ గేటుతో పాటు మరో 32 గేట్ల సామర్థ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి గేటుకు 15 రకాల పరీక్షలు నిర్వహించారు. డ్యాం గేట్లన్నీ భారీగా తుప్పుపట్టి భారీ రంధ్రాలు ఏర్పడ్డాయని, కొన్ని ప్రదేశాల్లో రంధ్రాల వల్ల గేటు ప్లేట్లు బాగా ధ్వంసం అయ్యాయని, గుస్సెట్ ప్లేట్లు, దిగువ స్టిఫినర్లు, గేట్లకు సపోర్టుగా ఉండే గడ్డర్లు, సపోర్టింగ్ ప్లేట్లు కూడా బాగా తుప్పుపట్టి, చిల్లులు పడ్డాయని ఆ సంస్థ ఇచ్చిన నివేదికలో వెల్లడించింది. గేట్ల సామర్థ్యం 45 ఏళ్లు కాగా, తుంగభద్ర గేట్లు 70 ఏళ్లు దాటడంతో మొత్తం గేట్లన్ని మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టంగా వివరించారు. ఆ నివేదిక ఆధారంగా డ్యాం 33 గేట్లు తొలగించి వాటి స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేసేందుకు టీబీపీ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది.



పాత గేట్ల తొలగింపు పనులు

తుంగభద్ర డ్యాం 33 గేట్లు కొత్తగా ఏర్పాటు చేసేందుకు రూ.44 కోట్లతో టెండర్లు పిలిచారు. గుజరాత్‌కు చెందిన 'హార్డ్‌వేర్ టూల్స్' సంస్థ టెండరు దక్కించుకుంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో జూలై నుంచి జలాశయంలోకి వరద మొదలు కావడంతో ఆ సమయంలో గేట్లు ఏర్పాటు పనులు మొదలు పెట్టలేదు. అయితే గేట్ల తయారి (ఫ్యాబ్రికేషన్) పనులు మాత్రం కాంట్రాక్ట్ సంస్థ చేపట్టింది. ఇప్పటికే 15 గేట్లు తయారు చేశారు. వీటిని అమర్చాలంటే పాత గేట్లు తొలగించాల్సి ఉంది. ఆ పనులను శుక్రవారం మొదలు పెట్టారు. బోర్డు సెక్రెటరీ ఓఆర్‌కే రెడ్డి, ఎస్‌ఈ నారాయణ నాయక్, బోర్డు కర్ణాటక సభ్యుడు కృష్ణమూర్తి కులకర్ణి, మునిరాబాద్ ఎస్‌ఈ, విజయనగర (హోస్పెట్) జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆర్డీఓ సహా ఏపీ, కర్ణాటక రైతులు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. తుంగభద్రమ్మకు జలహారతి ఇచ్చారు. తరువాత గేట్ల తయారి, అమరిక టెక్నికల్ సిబ్బంది పాత గేట్లను తొలగించే పనులు మొదలు పెట్టారు. సోమవారం నుంచి దాదాపు 80 మందితో పనులు వేగంగా చేపడుతామని బోర్డు ఎస్‌ఈ నారాయణ నాయక్ ఆంధ్రజ్యోతికి వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 జూన్ ఆఖరులోగా కొత్త గేట్లు ఏర్పాటు చేసే దిశగా ముందుకు వెళ్తామన్నారు.


నూతన గేట్లను డ్యాం వద్దకు తరలిస్తున్న దృశ్యం

జపాన్ నుంచి బేరింగుల దిగుమతి

టీబీపీ డ్యాంకు ఏర్పాటు చేసే గేట్లకు బేరింగులు ఎంతో కీలకం. మన దేశంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన బేరింగ్స్ అందుబాటులో లేకపోవడంతో జర్మని నుంచి దిగుమతి చేసుకోవాలని అనుకున్నారు. అక్కడ కూడా అదే పరిస్థితి ఉండడంతో ఒక్కో గేటుకు 12 చొప్పున 396 బేరింగులు దిగుమతి చేసుకున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఇందుకోసం రూ.2.50 కోట్లు ఖర్చు చేశారు. గేట్లు ఎత్తడం, దించడంతో బేరింగులు అత్యంత కీలకమని, అందుకే జపాన్ నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని ఏపీ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెకానికల్ సలహాదారు కన్నయ్యనాయుడు పేర్కొన్నారు.

నిధులు ఇవ్వని కర్ణాటక

డ్యాం నిర్వహణ, మరమ్మతులు.. వంటి పనులకు ఏపీ ప్రభుత్వం 55 శాతం, కర్ణాటక ప్రభుత్వం 45 శాతం వాటా నిధులు చెల్లించాల్సి ఉంటుంది. 33 గేట్లలో ఏపీ నిర్వహణలోకి 15 గేట్లు, కర్ణాటక నిర్వహణలోకి 18 గేట్లు వస్తాయి. మొత్తం 33 గేట్లు కొత్తగా ఏర్పాటు కోసం రూ.44 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. ఇందులో ఏపీ వాటా నిధులు రూ.20 కోట్లు ఇప్పటికే టీబీపీ బోర్డు విడుదల చేసినట్లు ఏపీ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెకానికల్ సలహాదారు కన్నయ్యనాయుడు వివరించారు. అయితే ఈ నిధుల విషయంపై కర్ణాటకకు లేఖ రాశామని, రెండు మూడు రోజుల్లో ఆ రాష్ట్రం కూడా వాటా నిధులు విడుదల చేస్తుందని బోర్డు ఎస్‌ఈ నారాయణ నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు.

బరితెగిస్తున్న బైక్ వీలర్స్

(5వ పేజీ తరువాయి)

మధ్యలో ఒళ్లు గగుర్పొడిచే రీతిలో బైక్ విన్యాసాలు చేశారు. చేతుల్లో కత్తులు పట్టుకుని హల్‌చల్ చేశారు. వారి విన్యాసాలను బ్యాచ్ సభ్యులు వీడియోతీసి, రీల్స్‌గా మలిచి ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఈ వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ బ్యాచ్‌లో ఉన్న గౌరీబిదునూరు, చిక్కబళ్లాపురం ప్రాంతాలకు చెందిన యువతులను గుర్తించారు. వీరు ఆరోజు రాత్రి పోలీసుల కన్నుగప్పి తప్పించుకున్నట్లు పట్టుబడినవారు చెబుతున్నారు.

ప్రజలు బలి

బైక్ వీలర్స్ చేసే పనుల వల్ల సాధారణ ప్రజలు కూడా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. పెనుకొండ బాబయ్య దర్గాలో పూజలు చేయడానికి వివిధ ప్రాంతాల నుంచి ద్విచక్రవాహనాల్లో వస్తున్న యువకులను పోలీసులు సోమందేపల్లి వద్ద ఆపి, వారి వాహనాలను సీజ్ చేశారు. దీంతో పలువురు ఉపాధిచ ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చిందని బాధితులు దాదు, ఆసిఫ్, అర్షద్, జమీర్, ఆజాద్, ముజ్జు, పర్వీన్, షేక్‌బాబు తదితరులు తెలిపారు. బెంగళూరులో మెడికల్ రెప్‌గా పని చేస్తున్న యువకుడు మూడు రోజుల కిందట దర్గాకు వచ్చి, పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. బైకు లేక ఉద్యోగానికి వెళ్లకపోవడంతో సోమవారంలోగా విధులకు రాకపోతే తొలగిస్తామని మెయిల్ పంపినట్లు వాపోయాడు. కియ పరిశ్రమలో కారు అసెంబుల్ విభాగంలో పని చేసే గోరంట్లకు చెందిన యువకుడు నైట్ షిఫ్ట్ విధులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా వీలర్ అనే అనుమానంతో సోమందేపల్లి వద్ద అతడి బైక్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఇలా డ్రైవర్లు, మెకానిక్‌లు, విద్యార్థులు, వెల్డర్లు, వ్యాపారులు అనేక మంది బైక్‌లను సీజ్ చేసినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వీలింగ్‌చేస్తున్న వారు పది నుంచి 20మంది ఉండగా వారితోపాటు 80మంది ద్విచక్రవాహనాలను పోలీసులు సీజ్ చేసినట్లు సమాచారం. గత ఏడాది వీలింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. దీంతో ఈఏడాది పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. డీఎస్పీ కార్యాలయంలో పట్టుబడిన వాహనదారులకు జరిమానా విధించి శనివారం వదిలిపెట్టారు.


డీఎస్పీ కార్యాలయంలో ఉంచిన సీజ్‌చేసిన బైకులు

పూర్తిస్థాయిలో నియంత్రించలేం

వీలర్స్‌ను పూర్తి స్థాయిలో నియంత్రించడం సాధ్యం కాదు. ఇది నిరంతరం చేపట్టాల్సిన ప్రక్రియ. పెనుకొండలోనే కాకుండా అన్నిచోట్ల వీలర్స్‌ను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారిని కట్టడి చేయాలి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలను నేను నమ్మను. అవి సబ్‌స్క్రైబ్స్‌ను పెంచుకోవడానికి ఎక్కడో జరిగిన సంఘటనలు తీసుకొచ్చి ఇక్కడ జరిగినట్లు చూపుతుంటారు. బెంగళూరు దగ్గరగా ఉండటంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు స్పోర్ట్స్‌బైక్‌లలో పెనుకొండకు ఎక్కువగా వస్తుంటారన్నారు. మేము వీలర్స్, రైడర్స్‌ను కట్టడి చేసేలా కృషి చేస్తాం.

-సీఐ రాఘవన్


బైక్‌ల కోసం నిరీక్షిస్తున్న జనం

వామ్మో.. విల్ట్


ఎండిపోతున్న మిరప పంట

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుతం కాయలు ఎర్రగా మారుతున్నాయి. ఈ సమయంలో విల్ట్ సోకటంతో లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. డబ్బీ రకం సాగుకు ఎకరాకు రూ.రెండు లక్షలు పెట్టుబడి పెట్టినట్లు పలువురు రైతులు పేర్కొన్నారు. కడ్డీ(గుంటూరు) రకం, తేజ కారం వంటి వాటికి ఎకరాకు ఇప్పటికే రూ.1.5లక్షలు పెట్టుబడి పెట్టామన్నారు. ఇలాంటి సమయంలో విల్ట్ తెగులు సోకటంతో కాయలు రంగు మారకుండానే ఎండి పోతున్నాయి. పాల్తూరు, కరకముక్కల, హావళిగి, అంచనహాళ్, గడేకల్లు, వేల్పుమడుగు, జనార్దనపల్లి, పొలికి గ్రామాల్లో వివిధ రకాలు మిరప పంటలు ఎండి పోతున్నాయి. ఇలా వరుస నష్టాలు సంభవిస్తుంటే ఎలా బతికేదంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పాల్తూరు వద్ద ఎర్రగా మారి ఎండిన కడ్డీ రకం కాయలు

20 ఎకరాల్లో ఎండుతెగులు: శ్రీకృష్ణ, పాల్తూరు, మిరప రైతు



నాకు 15 ఎకరాలు సొంత పొలం ఉంది. మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకున్నా. ఎకరాకలు రూ.40 వేలు చెల్లించా. మొత్తం 20 ఎకరాల్లో కడ్డీ రకం(గుంటూరు) సాగు చేశా. ప్రస్తుతం కాయలు పడి ఎర్రగా మారుతున్నాయి. తేమ ఎక్కువ కావటంతో మొక్కలు ఎండి పోతున్నాయి. మేరల్లో ఓ వైపు నుంచి సాళ్లకు సాళ్ల ఎండి పోతున్నాయి. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వస్తుందో రాదో అనే భయం వేస్తోంది. ఈ వేరుకుళ్లుకు ఎన్ని మందులు వాడినా ఫలితం లేదు.

నివారించలేం: యామిని, హార్టికల్చర్ అధికారి

గత నెలలో అధిక వర్షాలు రావటం, జీబీసీ కింద పంటలు సాగు చేయటం వల్ల మిరపకు ఎండు తెగులు సోకింది. కాలువ నీటిని సాళ్లకు పారించటం వల్ల నీరు ఒక మొక్క నుంచి మరో మొక్కకు వెళ్తూ ఉండటంతో ఈ ఎండు తెగులు మొక్కకు మొక్కకు అంటువ్యాధిలా సోకుతోంది. ఒక సారి విల్ట్ సోకితే ఇక ఆ పంటను కాపాడుకోలేము. మిరప పంట సాగు చేసే సమయంలోనే డ్రిప్‌లు ఏర్పాటు చేసుకుని నీటి తడులు ఇస్తే పంటను కాపాడు కోవచ్చు అన్నారు. సాళ్లకు నీరు పారుతున్నంత సేపు విల్ట్ వ్యాధి పంటలకు మొత్తం వ్యాపించి, పైరు ఎండిపోయేలా చేస్తుంది. పక్క పొలాలకు కూడా సోకే ప్రమాదం ఉంది. రైతులు ముందు జాగ్రత్తలు పాటించి పంటలను కాపాడుకోవాలి.

మహమ్మారి భయం

(5వ పేజీ తరువాయి)

ఆసుపత్రికి రావడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. దీనిపై హిందూపురం ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ వైద్యులతో సమావేశమై వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిగ్గర్ మైట్‌ను పోలిన చిన్న కీటకం ద్వారా వ్యాపించే ఈ ఇన్ఫెక్షన్ జ్వరాలకు ప్రధాన కారణం అవుతుంది. వర్షాకాలంలో తీవ్రంగా ఉంటుంది.


చిన్నారి శరీరంపై నల్లమచ్చలు

నల్లమచ్చలతో గుర్తింపు

కీటకం కుట్టినచోట నల్లటి మచ్చలు, దద్దుర్లు ఉన్నచోట కండరాల నొప్పులు, వాంతులు, తలనొప్పి, ఒళ్లునొప్పులు, పొడిదగ్గు లక్షణాలు కనిపిస్తాయి. ఇవన్నీ ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలి. అప్పుడే వ్యాధి నిర్ధారణ అయ్యే అవకాశం ఉంటుంది. తద్వారా తగిన చికిత్స పొందవచ్చు. లేదంటే 10నుంచి15రోజులు జ్వరం ఉండే అవకాశం ఉంటుంది. శరీరంపై చిన్న నల్లమచ్చ కనిపించిన వెంటనే జ్వరం వస్తే స్క్రబ్‌టైఫస్‌గా అనుమానించి ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలి. ఈ వ్యాధిని 1890లోనే జపాన్‌లో తొలిసారి జ్వరంతో గుర్తించారు. అప్పటి నుంచి అక్కడక్కడ కేసులు నమోదవుతున్నాయి. ఈ వ్యాధిలో మరణాలు పెద్దగా సంభవించలేదని వైద్యులు అంటున్నారు. కానీ జనం ఈ వైరస్ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పాత మంచాలు, పరుపులు, దిండ్లు, వారానికోసారి శుభ్రం చేసుకోవాలి. నివాసముండే చోట పందులు, ఎలుకల సంచారం లేకుండా చూసుకోవాలి. ముఖ్యంగా తడి నేలలు, పశువులపాకలో పనిచేసేవారు అప్రమత్తంగా ఉండాలి.

నాలుగు అనుమానిత కేసులు

హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి స్క్రబ్‌టైఫస్ లక్షణాలతో అనుమానిత కేసులు నాలుగు వచ్చాయి. ఇందులో మడకశిర, చిలమత్తూరు, హిందూపురం, కిరికెర పంచాయతీకి చెందిన వారు వచ్చారు. ఇందులో ఓ చిన్నారిని ఇక్కడి నుంచి బెంగళూరుకు తరలించారు. మరో ఇద్దరు పరీక్షలు చేయించుకుని ఇంటికి వెళ్లారు. తాజాగా కిరికెర పంచాయతీకి చెందిన 43ఏళ్ల మహిళకు ఈ లక్షణాలున్నట్లు చెప్పగా ఆమెను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన స్క్రబ్‌టైఫస్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. రక్తపరీక్షలు చేశారు. ఆ రిపోర్ట్ వచ్చాక స్క్రబ్ టైఫస్సా లేక మామూలు జ్వరమా అనేది తేలుతుందని వైద్యులు పేర్కొన్నారు.

ప్రత్యేక వార్డులో చికిత్స

స్క్రబ్ టైఫస్‌కు సంబంధించి అనుమానిత కేసులు వస్తుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో స్క్రబ్‌టైఫస్ ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. మాత, శిశుకేంద్రంలో చిన్న పిల్లల కోసం ఒకగది ఏర్పాటుచేసి అందులో పది బెడ్లు ఉంచారు. మహిళలకు సంబంధించి మూడు బెడ్లతో ఒక గది, పురుషులకు మరో ఐదు బెడ్లతో గదిని ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. ఒకవేళ అలాంటి లక్షణాలు ఉన్నవారు వస్తే ఈ ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్సలు అందిస్తామన్నారు.

ఆందోళన వద్దు

స్క్రబ్‌టైఫస్ వ్యాధి అంటు వ్యాధి కాదని దీనివల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తగిన సమయంలో ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకుని మందులు వాడితే తగ్గిపోతుంది. ఆసుపత్రిలో మూడు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు మూడు నాలుగు అనుమానిత కేసులు వచ్చినా వారి రక్త నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపాం. అందులో రెండు నెగిటివ్ వచ్చాయి. మరో రెండు రావాల్సి ఉంది.

-అన్నపూర్ణ,
ఆసుపత్రి సూపరింటెండెంట్, హిందూపురం

ఆభరణాల కోసం ఇంటి ఓనర్ హత్య

నిందితుల అరెస్ట్


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

గుత్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జరిగిన ఓ మహిళా హత్య కేసును వారం రోజుల్లోనే పోలీసులు ఛేదించారు. సీఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది ముమ్మరంగా దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐ, ఎస్ఐల సమక్షంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేసు వివరాలను వెల్లడించారు. గుత్తిఆర్ఎస్‌కు చెందిన విజయలక్ష్మి అలియాస్ రెడ్డమ్మ(54) ఇంట్లో బంధాల రాము, బంధాల అలిసమ్మ దంపతులు అద్దెకు ఉండేవారు. వీరికి డబ్బు అవసరం కావడంతో పథకం మేరకు విజయలక్ష్మిని ఆమె పొలానికి రప్పించారు. అక్కడ కంపచెట్లలో విజయలక్ష్మిని గొంతు నులిమి చంపేశారు. తర్వాత ఆమె మెడలో ఉన్న బంగారు చైను, కమ్మలు, సెల్‌ఫోన్ తీసుకున్నారు. అదే రోజు ఆటోలో రెడ్డమ్మ మృతదేహాన్ని వేసుకుని గుంతకల్లు మండలం వైటీ చెరువు గ్రామం వద్ద ఉన్న చెరువులో పడేశారు. మృతురాలి బంగారు చైనును అదే రోజు సాయంత్రం ఓ ప్రైవేట్ సంస్థలో తాకట్టు పెట్టి, వచ్చిన డబ్బును అవసరాలకు వాడుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కేసును పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశామన్నారు. వారు మృతదేహాన్ని తరలించిన ఆటోతో పాటు సెల్ ఫోన్, కమ్మలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ నిందితులు గతంలో చిన్న మహారాజు అనే వ్యక్తి ఇంట్లో అద్దెకు ఉంటూ అక్కడ కూడా బంగారు చైనును అపహరించి ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి డబ్బులు సొమ్ము చేసుకున్నారని ఆయన తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

డీ.హీరేహాళ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నిప్పు అంటుకొని గాయపడిన కురుబ సిద్దేశ్(38) శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు కర్ణాటక చిత్రదుర్గం జిల్లా పొక్కుర్తి గ్రామానికి చెందిన సిద్ధేశ్ మండల కేంద్రానికి చెందిన లక్ష్మిని 12 ఏళ్ల కిందట వివాహం చేసుకుని ఇక్కడే ఉండేవాడు. కూలి పని చేసుకుని జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో నవంబరు 30న మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద కొంతమంది చలికాపుకోవడం కోసం మంటను వేశారు. సిద్ధేశ్ కూడా అక్కడికి వెళ్లాడు. చలికాచుకుంటున్న సమయంలో తన పంచెకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పి, బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలియజేశారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. వీరికి ఒక కుమారుడు సంతానం కలరు.

దుస్తులు ఉతకడానికి వెళ్లి యువతి...

లేపాక్షి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో గల్లంతైన యువతి మృతదేహం మామిడిమాకులపల్లి వద్ద లభ్యమైంది. పోలీసులు తెలిపిన మేరకు మండలంలోని బ్రహ్మేశ్వరంపల్లి గ్రామానికి చెందిన అలివేలమ్మ కుమార్తె సుప్రియ(20) హంద్రీనీవా కాలువలో బట్టలుతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయింది. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కొట్టుకుపోయింది. మామిడిమాకులపల్లి వద్ద చెట్టుకు తగులుకుని తేలియాడుతున్న సుప్రియ మృతదేహాన్ని పశువుల కాపర్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ నారాయణ ఘటనా స్థలానికి వెళ్లి బ్రహ్మేశ్వరంపల్లికి చెందిన యువతిగా గుర్తించారు. మృతురాలికి తల్లి, సోదరుడడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నవ వరుడి ఆత్మహత్య

నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల వద్ద యాడికి మండలం నగరూరు వాసి మృతి


శరత్‌కుమార్ (ఫైల్)

యాడికి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): వివాహమైన నెల రోజులకే మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన శరత్‌కుమార్ (25) అనుమానాస్పదంగా శనివారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నగరూరు గ్రామానికి చెందిన జయరాముడు, ఆనంద కుమారి దంపతులకు ఇద్దరు కుమారులు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. పెద్ద కుమారుడు శరత్‌కుమార్ ఇంటర్ వరకు చదివి, బెంగళూరులో మినీ షాపింగ్‌మాల్ నిర్వహిస్తుండేవాడు. బళ్లారి ప్రాంతానికి చెందిన యువతితో నవంబరు 2న అతడికి వివాహమైంది. బెంగళూరులో ఉంటున్న శరత్‌కుమార్ శుక్రవారం నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలో స్నేహితుడి వద్దకు వచ్చాడు. అతడితో కలిసి ఆనందంగా ఉన్నాడు. విధులకు వెళ్లిన స్నేహితుడికి ఫోన్ చేసి, విషపుగుళికలు మింగినట్లు చెప్పాడు. స్నేహితుడు వెంటనే వచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. శరత్‌కుమార్‌ను తాడిపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలో శరత్‌కుమార్ మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు కొలిమిగుండ్ల పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

తాడిపత్రి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడు శనివారం మృతిచెందాడు. రైల్వే పోలీసు వరప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వృద్ధుడు ప్లాట్‌ఫాం టికెట్ తీసుకుని, రైల్వే ప్లాట్‌ఫాం బెంచీమీద కూర్చున్నాడు. కొంతసేపటికి కదలకపోవడంతో అనుమానం వచ్చి పలకరించగా మాట్లాడలేదు. వాలిపోయాడు. దీంతో 108 సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. వృద్ధుడి వయస్సు 60ఏళ్లపైగా ఉంటుందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

కుక్క కాటుతో 11 మందికి గాయాలు

రాయదుర్గంరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో కుక్క కాటుతో 11 మంది గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో పిచ్చికుక్క చొరబడి సతీష్, వీరభద్ర, రాజు, ఉలిగప్ప, గంగమ్మ, సందీప్, మల్లేష్, పరమేశ్వరప్ప, నవరమ్మ, మల్లేష్‌ను తీవ్రంగా కరచి, గాయపరచింది. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వీరభద్ర, రాజును రాయదుర్గం ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమచికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు వైద్యులు తెలిపారు.

64 గొర్రెపిల్లలు..

శింగనమల, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులేడు గ్రామంలో వీధి కుక్కల దాడిలో 64 గొర్రెపిల్లలు మృతిచెందాయి. తద్వారా రూ.3 లక్షలు పైగా నష్టం వాటిల్లిందని కాపర్లు తెలిపారు. ఆకులేడుకు చెందిన చిన్న నారాయణస్వామి, చిన్న రాజుకు గొర్రెల మందను గ్రామ సమీపంలో తోలుకున్నారు. శనివారం పిల్లలను ఇనుప కంచె మధ్యలో ఉంచి గొర్రెలను మేపునకు తోలుకెళ్లారు. వీధి కుక్కలు దాడిచేసి 64 గొర్రెపిల్లలను చంపేశాయి. సాయంత్రం వచ్చిన కాపర్లు మృతిచెందిన గొర్రెపిల్లలను చేసి, కన్నీరుమున్నీరయ్యారు. సలకంచెరువు పశువైద్యాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి.. గొర్రెపిల్లలకు పంచనామా నిర్వహించారు.


గొర్రెపిల్లల కళేబరాలు

మళ్లీ పాత కథేనా..?

క్యాంపు రాజకీయాలకు తెరలేపిన వైసీపీ
టీడీపీ వైపు కుంటిమద్ది ఎంపీటీసీ మొగ్గు?
11న రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక


ఎన్నిక నిర్వహణపై సమీక్షిస్తున్న అధికారులు

రామగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక మళ్లీ పాతకథనే తలపిస్తోంది. ఈనెల 11న ఎంపీపీ ఉప ఎన్నిక జరగనుండగా ఎప్పటిలాగే వైసీపీ క్యాంపు రాజకీయాలు మొదలు పెట్టింది. వైసీపీకి చెందిన ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిని శనివారం కలిసి ఆయన ఆధీనంలోనే ఉన్నట్టు సమాచారం. గత ఎన్నికల సమయంలో వైసీపీకి ఆరుగురు సభ్యులు ఉండగా ఈ సారి కుంటిమద్ది ఎంపీటీసీ సాయిలీల టీడీపీవైపు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. ఆమె ఫోన్ పని చేయకపోవడం, గ్రామంలో అందుబాటులో లేకపోవడం, వైసీపీ క్యాంపులో కూడా లేకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే ఆమె, ఆమె భర్త టీడీపీ వర్గీయులతో మాట్లాడి తాము టీడీపీకే మద్దతుగా నిలుస్తామని చెప్పినట్లు సమాచారం. అయితే టీడీపీ వర్గీయుల కూడా ఈ వార్తను ధ్రువీకరించడంలేదు. కుంటిమద్ది ఎంపీటీసీ టీడీపీకి మద్దతుగా నిలిస్తే ఎంపీపీ అభ్యర్థిగా నిలిచే అవకాశం ఉంటుంది. ఈనేపథ్యంలో గత ఎన్నికల మాదిరే వైసీపీ ఎన్నికలను బహిష్కరిస్తే ఎంపీపీ ఎన్నిక సులువుగా జరిగిపోతుంది. కానీ ఇప్పటికే వైసీపీ నాయకులు పోలీసుల రక్షణలో ఎన్నికలలో పాల్గొనాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. పోలీసులు బందోబస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వైసీపీకి చెందిన ఓ సభ్యుడు తనకు ఏ పార్టీ వద్దని అన్నారని, అలా జరిగితే ఇబ్బంది అవుతుందని ఆ సభ్యున్ని కూడా వైసీపీ క్యాంపు రాజకీయాలకు పంపినట్లు సమాచారం.

ఎంపీడీఓతో సమీక్షించిన పోలీసులు

రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక ఏర్పాట్లపై సీఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్‌లు ఎంపీడీఓ గంగావతితో శనివారం సమీక్షించారు. ఈనెల11న ఎంపీపీ ఉప ఎన్నిక నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్ల గురించి చర్చించారు. ఎంపీటీసీలు 9 మంది ఉండగా ఇందులో ముగ్గురు టీడీపీ, ఆరుగురు వైసీపీకి చెందినవారు ఉన్నారు. ఇప్పటికే నాలుగు సార్లు ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చి వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ సారైన ఎన్నికలు జరుగుతాయా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

అప్పులకు అన్నదాతలు బలి

వేర్వేరుచోట్ల ఇద్దరు రైతుల ఆత్మహత్య


త్రివేంద్ర (ఫైల్)


గుర్రప్ప (ఫైల్)

గార్లదిన్నె/కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అప్పులకు జిల్లాలో ఇద్దరు అన్నదాతలు బలయ్యారు. గార్లదిన్నె మండలం కోటంక గ్రామంలో అప్పుల బాధ భరించలేక గోసుల గుర్రప్ప (79) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు మేరకు.. గోసుల గుర్రప్ప, సుబ్బక్క దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వారికున్న 4.30 ఎకరాల భూమిలో చీనీ చెట్లు సాగుచేస్తున్నారు. మూడేళ్లుగా దిగుబడి రాలేదు. పంటల సాగుకోసం తెలిసిన వారివద్ద అప్పులు చేశారు. బోరుబావుల్లో నీరు ఇంకిపోవడంతో ఎండుతున్న చీనీ చెట్లను కాపాడుకునేందుకు 4 బోర్లు వేశారు. దీంతో అప్పులు రూ.8 లక్షలు దాటాయి. పంటలు దిగుబడి రాక, చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో మనస్తాపం చెందిన గుర్రప్ప శనివారం చీనీచెట్లకు పిచికారీ చేసే పురుగుల మందును తన తోటలోనే తాగి, ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్తున్న గొర్రెల కాపర్లు గమనించి.. కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలియజేశారు. ఇంటి పెద్దదిక్కు కోల్పవడంతో ఆ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. గుర్రప్పకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మంగళకుంటలో యువరైతు..

కళ్యాణదుర్గం మండలంలోని మంగళకుంట గ్రామంలో అప్పుల బాధతో యువరైతు కురుబ త్రివేంద్ర (30) శనివారం ఉరేసుకుని, ప్రాణం తీసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దాదాపు పదెకరాల పొలంలో మొక్కజొన్న, టమోటా, వేరుశనగ, మామిడి సాగు చేశాడు. పెట్టుబడుల కోసం రూ.పది లక్షల వరకు అప్పులు చేశాడు. దిగుబడులు రాక అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. తన తోటలోని చెట్టుకు లుంగీతో ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. త్రివేంద్ర తల్లి యశోదమ్మ, భార్య గంగోత్రి పని నిమిత్తం తోటలోకి వెళ్లగా.. చెట్టుకు వేలాడుతున్న త్రివేంద్రను చూసి బోరున విలపించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికలు వాయిదా

అనంతపురం అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని 18 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. తొలి విడతలో ఉమ్మడి జిల్లాలోని 55 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందులో అనంత జిల్లాలో 25కిగాను 13 సంఘాలకు ఎన్నికలు జరగలేదు. శ్రీసత్యసాయి జిల్లాలో 30కిగాను 5 సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. ఆయా సంఘాలకు తగిన రికార్డులు లేకపోవడం, ఇతర కారణాలతో ఎన్నికలు వాయిదా పడినట్లు పశుసంవర్థక శాఖ జేడీ కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

డిగ్రీలో నలుగురు డీబార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ యూజీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షలలో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు ఎస్కేయూ పరీక్షల విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ శనివారం తెలిపారు. అనంతపురంలో ముగ్గురు, హిందూపురంలో ఒకరు కలిపి మొత్తం నలుగురు మాస్ కాపీయింగ్ పాల్పడుతుండటాన్ని గుర్తించి, డీబార్ చేసినట్లు తెలిపారు.

10న స్పాట్ అడ్మిషన్లు

జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐలో ఎమ్మెస్సీ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సులో కన్వీనర్ కోటా మిగులు సీట్లకు ఈనెల 10వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ఆచార్య సుబ్బారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. పీజీసెట్-2025లో అర్హత సాధించకపోయినా, పరీక్ష రాయకున్నా అర్హులన్నారు. అడ్మిషన్ పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు. అర్హులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో 10వతేదీ ఉదయం 10 గంటలకు ఓటీపీఆర్ఐ డైరెక్టర్ కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

టమోటా కిలో రూ.32

అనంతపురంరూరల్,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శనివారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.32తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.14తో, సరాసరిగా రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1,125 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీలకు నరేష్ ఎంపికయ్యాడు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న నరేష్ ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో నిర్వహించిన జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ చాటాడు. ప్రథమ స్థానంలో నిలిచిన నరేష్‌ను ఆదివారం నుంచి దుబాయ్‌లో నిర్వహించే ఇంటర్నేషనల్ పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేశారు. భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల కరస్పాండెంట్ పీఎల్ఎన్ రెడ్డి, ప్రెసిడెంట్ రమణారెడ్డి, కార్యదర్శి నిర్మలమ్మ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామమోహన్, పీడీ శ్రీనివాస్‌రెడ్డి, నరేష్‌కి ఆర్థిక సహాయం అందజేసి, అభినందనలు తెలిపారు.

జేఎన్‌టీయూలో సదస్సు


మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూలోని ఆర్యభట్టా ఆడిటోరియంలో శనివారం స్ట్రాటజిక్ రోడ్ మ్యాప్ ఫర్ ఇంప్రూవింగ్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్-2026 అనే అంశంపై సదస్సు జరిగింది. ఇందుకు ఏపీఎస్‌హెచ్ఈ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఆచార్య విజయభాస్కర్, వీసీ ఆచార్య సుదర్శనరావు, ఏపీహెచ్ఎస్ఈ సభ్యులు అనిల్‌కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీసీ సుదర్శనరావు జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వివరిస్తూ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలు మెరుగైన పనితీరు కనబరచాలన్నారు. ఆ పనితీరుతోనే ర్యాంకింగ్‌లను మెరుగుపరుచుకోవాలన్నారు. అనంతరం అధ్యాపకులు చేయాల్సిన క్రెడిట్స్‌ను, క్వాంటంతో భవిష్యత్తు అనే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. యోగివేమన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య రాజశేఖర్, ఐక్యూ డైరెక్టర్ ఆచార్య పద్మ సువర్ణ, చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ రజనీష్‌కుమార్, కో-ఆర్డినేటర్లు ఆచార్య దిలీప్‌కుమార్, ఆచార్య నారాయణరెడ్డి, వీసీ ఓఎస్డీ దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్షణ శక్తి యాప్

బాలికలందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
డీఎస్పీ మహబూబ్ బాషా

అనంతపురం వైద్యం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితులు, ఆపద సమయంలో విద్యార్థినులకు భద్రత, రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా శక్తి యాప్‌ను రూపొందించిందని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ మహబూబ్ బాషా సూచించారు. బాలికలందరూ ఫోన్లలో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, వ్యక్తిగత వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. శనివారం ప్రభుత్వ వైద్యవిద్య కళాశాలలో మెడికల్, నర్సింగ్, పారామెడికల్ విద్యార్థినులకు శక్తియాప్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్ఎంఓ డాక్టర్ హేమలత అధ్యక్షత వహించిన సదస్సుకు సర్వజన వైద్యశాల సూపరింటెండెట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డీఎస్పీ మహబూబ్ బాషా హాజరై, మాట్లాడారు. మహిళలు, చిన్నారులు, విద్యార్థుల రక్షణకు పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా సైబర్ హెల్ప్‌లైన్ 1930, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చిల్డ్రన్ హెల్ప్‌లైన్ 1098, అంబులెన్స్ 108, ఫైర్ సర్వీస్ 101, రోడ్డు యాక్సిడెంట్ 173, టూరిస్ట్ హెల్ప్‌లైన్ 1363, ఉమెన్ ట్రాఫికింగ్ హెల్ప్‌లైన్ 1091 నెంబర్లకు యాప్ ద్వారానే ఫోన్ చేయాలని సూచించారు. తద్వారా త్వరితగతిన సహాయం అందుతుందని వివరించారు. అనంతరం డీఎస్పీ మహబూబ్ బాషాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్ లత, భాగ్యరాణి, నరేష్, శోభ, కృష్ణవేణి, సరోజ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో డీఎస్పీ మహబూబ్ బాషా

మహిళా పక్షపాతి సీఎం చంద్రబాబు

- మంత్రి సవిత



చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు మహిళా పక్షపాతి అని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె స్వయం సహాయ సంఘాల మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వివిధ పథకాల కింద 1974మంది లబ్ధిదారులకు స్త్రీనిధి రుణం కింద రూ.18.06కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సామాజిక పెట్టుబడి, బ్యాంక్ లింకేజీ ద్వారా 1413మందికి రూ.138.46కోట్లు విడుదలయ్యాయి. సీడ్ క్యాపిటల్ పథకం కింద 141మందికి రూ.55.10లక్షలు, రైతు ఉత్పత్తిదారులకు రూ.1.03కోట్లు, ఎస్ఎస్‌సీఎస్ పథకం కింద 49మంది లబ్ధిదారులకు రూ.24.50లక్షలు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల బలోపేతానికి అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

బెల్టు తీయండి: ఎక్సైజ్ డీసీ


సీఐతో మాట్లాడుతున్న డీసీ నాగమద్దయ్య

ధర్మవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బెల్ట్‌షాపుల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని అనంతపురం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. స్థానిక ఎక్సైజ్‌శాఖ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనుమతులు లేకుండా కర్ణాటక మద్యం, నాటు సారా అమ్మడం, బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ ఏపీసురక్ష యాప్ ద్వారా ప్రతిషాపులో స్కాన్ చేసి మద్యం విక్రయాలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, స్థానిక సీఐ చంద్రమణి, ఎస్ఐలు నాగరాజు, చాంద్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

పునరావృతమైతే జైలుకే

తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి బైక్‌లు అప్పగించిన ఎస్పీ


హెచ్చరికలు జారీచేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పెనుకొండ టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై వివిధ ప్రాంతాల్లో బైక్‌రైజింగ్‌లు, వీలింగ్ చేస్తే జైలుకేనని ఎస్పీ సతీష్‌కుమార్ బైక్ రైడర్లను హెచ్చరించారు. బుధవారం గంధం ఉరుసులో భాగంగా ద్విచక్రవాహనాల్లో పెనుకొండకు వచ్చిన యువత 44వ జాతీయరహదారిపై బైక్ విన్యాసాలు చేశారు. ఎస్పీ ప్రత్యేక బృందాలు పంపి 110 వాహనాలను సీజ్ చేయించారు. మూడు రోజుల అనంతరం శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ద్విచక్రవాహనాల్లో పట్టుబడిన వారి కుటుంబ సభ్యులను పిలిపించి వారి సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి ద్విచక్రవాహనాల రికార్డులు పరిశీలించి అప్పగించారు. హెల్మెట్లు లేనివారికి సాధారణ ఫైన్లువేశారు. తల్లిదండ్రులు కూడా బాధ్యతాయుతంగా పిల్లల్ని పెంచాలని వాహనాలు తీసిచ్చే సమయంలో జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. బైక్ రైజింగ్ (వీలింగ్) చేయడం చట్టరిత్యా నేరమని తెలిపారు. ఒక్కో బైక్‌కు రూ.5వేల నుంచి రూ.10వేలదాకా జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. మొదటిసారి జరిమానాతో సరిపెట్టామని ఇలాగే కొనసాగితే కేసులు నమోదుచేసి వాహనాలు తిరిగి ఇవ్వమని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ నర్సింగప్ప, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్


చండీహోమంలో పాల్గొన్న చిలకం మధుసూదన్‌రెడ్డి దంపతులు

పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ధర్మవరం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొట్లూరులో వెలసిన పెద్దమ్మదేవి ఆలయంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో వడుగూరు కుటుంబసభ్యులు నిర్వహించిన చండీహోమానికి చిలకం మధుసూదన్‌రెడ్డి, ఆయన సతీమణి చాయాదేవి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చండీహోమంలో పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామంలోని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

స్టడీ అవర్స్‌ను సద్వినియోగం చేసుకోండి

● విద్యార్థులకు డీఈఓ క్రిష్టప్ప సూచన

కొత్తచెరువు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం వందరోజుల స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తోందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి క్రిష్టప్ప తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను శనివారం ఆయన ఎంఈఓ జయచంద్ర, హెచ్‌ఎంగోపాల్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులకు సెలవు దినాల్లో కూడా స్టడీ అవర్స్‌ను నిర్వహించాలని తెలిపారు. ఎంఈఓ-1 సోమశేఖర్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీఎన్జీఓల తాలూకా అధ్యక్షుడిగా మురళీకృష్ణ


శ్రీశైలం మురళీకృష్ణకు డిక్లరేషన్ అందిస్తున్న ఎన్నికల అధికారులు

బుక్కపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ సత్యసాయి తాలుకా అధ్యక్షుడిగా శ్రీశైలం మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పుట్టపర్తి సాయి ఆరామంలో జరిగిన ఎన్నికల్లో మురళీకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఏపీ ఎన్జీఓ ఉద్యోగుల, సిబ్బంది సంక్షేమానికి, హక్కులను కాపాడడానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మాధవ, జిల్లా అధ్యక్షుడు లింగా రామ్మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య అధికారులు, సిబ్బంది మురళీకృష్ణను అభినందించారు.

కమిటీ ఎంపిక

ధర్మవరం రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణ సమితి ధర్మవరం డివిజన్ నూతన కమిటీని శనివారం ఎంపిక చేశారు. పట్టణంలోని స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో మానవ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు గంగులయ్య ఆధ్వర్యంలో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ సమితి డివిజన్ గౌరవాధ్యక్షుడిగా కొండయ్య, చైర్మన్‌గా కోట్ల వంశీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పేరూరు రామాంజులు, జనరల్ సెక్రటరీగా ఇల్లూరి ఓబులేష్, జాయింట్ సెక్రటరీలుగా మద్దెల ఐూశ్వర్, గడ్డం శ్రీనివాసులు, చందమూ రి పోతలయ్యను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు తెలిపారు. అలాగే గౌరవ సభ్యుడిగా శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలిగా శ్రీదేవి, ధర్మవరం, కనగానపల్లి మండలాల అధ్యక్షులుగా ఆదిశేషు, చౌడప్పను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. వీరిని శాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

మహాసభల పోస్టర్ల విడుదల

ముదిగుబ్బ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరుగుతున్న అఖిల భారత సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో శనివారం సీఐటీయూ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బాబ్జాన్, శ్రీరామ్ రెడ్డి, టైలర్ ముస్తఫా, బండల వెంకటేష్, పోతలయ్య, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థల పరిశీలన

నల్లమాడ, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఎర్రవంకపల్లిలో ఎస్సీఎస్టీ వారికి శ్మశానవాటికోసం తహసీల్దార్ మనోజ్‌కుమార్‌రెడ్డి, డీవీఎంసీ సభ్యులు న్యాయవాది వీరనారాయణ శనివారం స్థలాన్ని పరిశీలించారు. అలాగే ఎస్సీ కాలనీ వెనుక భాగాన, సచివాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను ఇంటిపట్టాల కోసం పరిశీలించారు. అలాగే నల్లమాడ నుంచి మలకవేమల ప్రధాన రహదారినుంచి ఎర్రవంకపల్లికి పోయే ప్రధాన రహదారిలో రస్తాను ఆక్రమించారని, దాన్ని కూడా పరిశీలించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేసినట్లు డీవీఎంసీ సభ్యులు తెలిపారు. వారితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆగిన రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

గాండ్లపెంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొడ్డువెలగల పంచా యతీలో అర్థాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. తుమ్మల బైలు నుంచి గొడ్డువెలగల పంచాయతీకి గతంలో తారు రోడ్డు వేశారు. గొడ్డువెలగల సమీపాన అటవీ ప్రాంతంలో అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో కొంత వరకు సిమెంట్ రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఎమ్మెల్యే చొరవతో అటవీశాఖ అధికారుల అనుమతి తీసుకొని ఎన్‌ఆర్‌జీఎస్ పథకం కింద సుమారు రూ. 30లక్షల వ్యయంతో 600 మీటర్లు సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. గతంలో తుమ్మలబైలు, సాదుల వాండ్లపల్లి, పెద్దతండా గ్రామవాసులు వివిధ పనుల నిమిత్తం గ్రామ సచివాలయానికి రావాలంటే ఎంతో ఇబ్బందులకు గురయ్యేవారు. ప్రస్తుతం రోడ్డు సమస్య తీరి రాకపోకలకు సులభంగా మారుతుందని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వేమయ్య కుమార్, కుమారస్వామి, గంగులప్ప, నరసింహులు, వెంకటరమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పక్కా భవనం లేని పాఠశాల

● వసతులులేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, టీచర్లు



ప్రభుత్వ పాఠశాల నిర్వహిస్తున్న ఆర్డీటీ కమ్యూనిటీ హాల్


కమ్యూనిటీ హాల్‌లో పాఠ్యాంశాలు బోధిస్తున్న టీచరు

తనకల్లు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నేళ్లు... ఇలా ప్రైవేటు భవనాల్లో ప్రభుత్వ విద్యార్థులకు విద్యాబోధన సాగిస్తారని ఆ గ్రామ స్థులు ప్రశ్నిస్తున్నారు. ఏ ప్రభుత్వం అధికారం చేపట్టినా, విద్యకు పెద్ద పీట వేస్తున్నట్లు ప్రగాల్భాలు పలకడమే తప్ప ఆచరణలో కనిపించడం లేదంటున్నారు. మండలపరిధిలోని ఎర్రగుంటపల్లిలో ఈ పరిస్థితి కనిపిస్తుంది. ఎర్రగుంటపల్లిలోని ప్రాథమిక పాఠశాల భవనం పాడుపడిపోయిందని, ప్రభుత్వ అధికారులే దాదాపు ఏడేళ్ల క్రితం మూసివేశారు. దీంతో అప్పట్లో ఉపాధ్యాయులు చెట్ల కింద చదువులు చెప్పేవారు. గ్రామస్థులే చొరవ చూపి ఆర్డీటీ వారిని ఒప్పించి గ్రామంలోని ఆర్డీటీ కమ్యూనిటీ భవనంలోకి పాఠశాలను మార్చారు. అందులో వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేవు. వంటగది లేకపోవడంతో ఏజెన్సీ వారు మధ్యాహ్న భోజనాన్ని ఇంటి వద్దే వండి తీసుకొస్తున్నారు. పాఠశాలకు వసతులతో కూడిన పక్కా భవన లేకపోవడంతో గ్రామంలోని చాలా మంది పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో ఐదు తరగతులకు కలిపి మొత్తం 13మంది విద్యార్థులు ఉన్నారు. ఇదిలా ఉండగా గత వైసీపీ పాలనలో నాడు - నేడు పథకం కింద నిధులు మంజూరయ్యాయి. పునాదుల వరకు వేశారు. అంతలోనే పాఠశాలకు బెంచీలు, తలుపులు తదితర సామగ్రి వచ్చింది. వాటిని ఎక్కడా ఉంచలేక ఆర్డీటీ కమ్యూనిటీ హాలులోనే ఉంచారు. ఉన్న ఒకే గదిలో సామగ్రి ఆక్రమించగా మిగిలిన స్థలంలోనే విద్యార్థులను కూర్చోబెట్టి బోధన చేసేందుకు ఉపాధ్యాయురాలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి ఇలా ఉన్నా పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపాల్సిన మండలస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అనూరాధ, శివకుమార్ తదితరులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతి నిధులు తమ గ్రామానికి పాఠశాల భవనం మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

గత వైసీపీ ప్రభుత్వంలో నాడు- నేడు మొదటి విడతలో ఎర్రగుంటపల్లి పాఠశాలకు పక్కాభవనం మంజూరు కాలేదు. రెండోవిడతలో మంజూరైంది. అయితే ఒక విడత మాత్రమే నిధులు వచ్చాయి. దీంతో పునాదులు వేశారు. పాఠశాలకు బెంచీలు, తలుపులు, బోర్డులు, పంపారు. వాటిని బయట ఉంచలేక ఆర్డీటీ కమ్యూనిటీ భవనంలో ఓ పక్క ఉంచాం. తరువాత నిధులు విడుదల కాలేదు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. త్వరలోనే సమస్య పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తాం.

-లలితమ్మ, ఎంఈఓ

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే కందికుంట


ఆర్వోబీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం డబుల్ ఇంజన్ సర్కార్ ధ్యేయమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. అలాగే ముందుకెళ్తున్నామన్నారు. మండలపరిధిలోని కౌలేపల్లి వద్ద రూ.56 కోట్లతో నిర్మించిన రోడ్డు ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ)ని ఆ యన శనివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో ఎన్డీఏ పాలనలో రెండు ఆర్వోబీలు మంజూరయ్యాయని, వాటిని పూర్తి చేయడంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ 18నెలల కాలంలో తాము భూ యజమానులతో పలుమార్లు చర్చించి, ఒప్పించామన్నారు. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంతోపాటు, తాము కూడా కొంత రైతులకు సాయం చేసి, భూసమస్యను పరిష్కరించామన్నారు. కుటాగుళ్ల వద్ద ఉన్న ఆర్వోబీ నిర్మాణానికి వైసీపీ నాయకులు ఇబ్బందులు కలిగిస్తున్నారని, అయినా వాటన్నింటిని పరిష్కరించి, త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు క్రిష్ణమోహన్, స్వచ్ఛందా కార్పొరేషన్ డైరెక్టర్ ఫర్వీనాబాను, టీడీపీ నాయకులు బాహుద్దీన్, ఇస్మాయిల్, తాతా శీనా, రాజశేఖర్‌బాబు, మహబూబ్‌బాషా, రమణమ్మ, ప్రేమలత, ఉమాదేవి, క్రిష్ సంస్థ ప్రతినిధులు, పిఆర్‌గ్రాండ్ యజమాని గణేష్, ఓరాతి చంద్ర, పతి, మాబూ, ప్రకాష్, ఈశ్వర్, రాజశేఖర్, మనోహర్, నాయకులు, కార్యకర్తలున్నారు.

ఎమ్మెల్యే ప్రజాదర్బార్

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలవద్దకే వస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. తలుపుల మండల పరిధిలోని కుర్లి సచివాలయం పరిధిలో శనివారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ప్రజలందరూ పనిచేసే ఈ ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. ప్రజాదర్బార్‌లో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 114 అర్జీలు వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీడీఓ నజీమా, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రవి, టీడీపీ నాయకులు ముబారక్, శ్యామ్‌సుందర్, ఓబులరెడ్డి, మేడా శంకర్, గంగరాజు, ఎద్దుల క్రిష్ణమూర్తి, నాయకులు, కార్యకర్తలున్నారు.

భూమిపూజ

● నల్లచెరువు: మండల పరిధిలోని పంతులచెరువు గ్రామంలో రూ. 32లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. మండల పరిధిలోని బాలేపల్లికి తండా, పంతులచెరువుకు రెండు పంచాయతీ భవనాలు మంజూరైనట్లు తెలిపారు. తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌బాబు, నాయకులు అబ్దుల్ ఖాదర్, మాబుసాబ్,నాగభూషణ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు చేరువ కావాలి: ఆర్డీఓ

ధర్మవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేరువకావాలని ఆర్డీఓ మహేశ్, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని పోతుకుంట గ్రామంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం గ్రామ అభ్యున్నతికి అంకితం అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మల్లికార్జున, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగవేణి, బీజేపీ నాయకులు పోతుకుంట రాజు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు మధ్యప్రదేశ్ సీఎం : హరీశ్‌బాబు

ధర్మవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి కాంస్య విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 11న ధర్మవరంలో చరిత్రాత్మకం కానుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్, కేంద్ర మంత్రులు, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ రోజు నియోజకవర్గంలోని 2087 మంది పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేస్తామని తెలిపారు.

ఉచిత పశువైద్య శిబిరం

తనకల్లు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని సున్నంపల్లి వారిపల్లిలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్యంగా పశువులలో గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేశారు. గొర్రెల్లో ఆంత్రాక్స్ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. 25 పశువులకు 345 గొర్రెలకు ఉచితంగా మందులు, మాత్రలు అందించారు.

డీఎస్పీ తనిఖీ

కదిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఆదేశాల మేరకు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి శనివారం తలుపుల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను తనిఖీచేసి, మూడేళ్లలో నమోదైన కేసులపై పరిశీలించారు. హత్య, చోరీ కేసులలోని నిందితులను పట్టుకొని వారిపై త్వరగా చార్జ్‌షీట్ ఫైల్ చేసి, వారికి శిక్ష పడేటట్లు దర్యాప్తు చేయాలని తలుపుల ఎస్ఐ నరసింహులుకు సూచించారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, లా అండ్ ఆర్డర్ సమస్యలు రాకుండా పోలీసింగ్ నిర్వహించాలని ఎస్ఐకి డీఎస్పీ సూచనలు చేశారు.

పార్టీని మరింత బలోపేతం చేద్దాం

● టీడీపీ పరిశీలకురాలు

అమడగూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా టీడీపీ మరింత బలోపే తం చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేద్దామంటూ పార్టీ పరిశీలకురాలు శైలజా వెంకటేష్ తెలిపారు. ఆయన శనివారం మండలపరిధిలోని మహమ్మ దాబాద్‌లో నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ విధివిధానాలను తప్పకుండా పాటించి పార్టీని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలపై వివరించాల్సిన బాధ్యత నాయకులదే అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిద్ద లింగప్ప, శ్రీరాములు, సూర్యనారాయణ, మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, కమ్మల భాస్కర్, డైరీ శ్రీనివాసులు, టైలర్ రామాంజులు, మధు, నాగేంద్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

● ప్రపంచ మేధావి అంబేడ్కర్: ఎమ్మెల్యే కందికుంట


కదిరిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్థంతి సందర్భంగా శనివారం కదిరి పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, జన సేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ భైరప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఫర్వీనాబాను, పలువురు నాయకులు, కార్యకర్తలున్నారు. అలాగే ధర్మవరం పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశగాళ్ల శ్రీనివాసులు పూలమాల వేసి నివాళుల ర్పించారు. టీడీపీ నాయకులు మొండి శీన, ఆదినారాయణ, నరసింహ, నవీన్, ఇజ్రాయిల్, శివ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవరకొండ రమేశ్, రాష్ట్ర కార్యదర్శి చౌడప్ప తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుక్కపట్నంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ స్థానిక నాయకులు బుక్కపట్నంలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాజీ ఎంపీపీ బాలు, బులగుండ్ల శ్రీనివాసులు, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్ల కృష్ణ కేసాని ఆదినారాయణ, కరణం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

● అలాగే కదిరిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు నాయకులు, అంబేడ్కర్ సేవా సమితి నాయకులు నివాళులర్పించారు. ఆర్టీసీ డిపో ఆవరణంలో ఏపీపీటీడీ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ మైనుద్దీన్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పెద్దన్న తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిశంగా నంబులపూలకుంటలోని నాగులకట్ట సమీపంలో, తహసీల్దార్ కార్యాల యంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించారు. అలాగే ము దిగుబ్బ, అమడగూరు, గాండ్లపెంట, నల్లచెరువు, నల్లమాడ, ఓబుళ దేవర చెరువు, తనకల్లు తదితర మండలకేంద్రాల్లో, తనకల్లు మండలంలోని వంకపల్లి గ్రామంలో అంబేడ్కర్ వర్థంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్, దళి త సంఘాల నాయకులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ప్రజా సంఘల సభ్యులు పాల్గొన్నారు.


ధర్మవరంలో నివాళులర్పిస్తున్న కేశగాళ్ల శ్రీనివాసులు తదితరులు



బుక్కపట్నంలో టీడీపీ నాయకుల నివాళి



అయ్యప్పస్వామికి లక్ష పుష్పార్చన చేసిన దృశ్యం, కన్నెపూజ చేస్తున్న అయ్యప్ప మాలధారులు

అయ్యప్పస్వామికి లక్ష పుష్పార్చన

ధర్మవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేశవనగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి విజయ్‌కుమార్, అయ్యప్ప మాలధారుల ఆధ్వర్యంలో శనివారం స్వామికి లక్ష పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సాగింది. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన 600 మందికిపైగా కన్నెస్వాములచే ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు గురుస్వామి తెలిపారు. అనంతరం గణపతి, నవగ్రహ, శాంతిహోమాలు నిర్వహించారు. ఆదివారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం, అన్నదాన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

రేపటి నుంచి మండల పూజ

కదిరి అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పనగర్‌లో వెలిసిన అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు 49వ మండల పూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ శంకరయ్య శనివారం తెలిపారు. సోమవారం తిరుమంజనం, ధ్వజారోహణ, మంగళవారం కన్నె పూజ, అన్నదాన కార్యక్రమం ఉంటాయన్నారు. బుధవారం గ్రామోత్సవం, అనంతరం అగ్నిగుండ ప్రవేశం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

స్క్రబ్ టైఫస్‌పై జాగ్రత్త: వైద్యాధికారి

ధర్మవరం రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి దిలీప్ కుమార్ తెలిపారు. ఆయన శనివారం దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధి రికెట్ సియా అనే బ్యాక్టీరియా ద్వారా వస్తుందని, ఈ బ్యాక్టీరియా మైట్స్ అనగా పిడుదులు, చిడుములు వంటి వాటిలో ఉంటుం దని తెలిపారు. రికెట్ సియా బ్యాక్టీరియా ఉన్న మైట్స్ మనిషిని కుట్టినప్పుడు కుట్టిన పదిరోజుల్లో ఈ వ్యాధి సోకుతుందన్నారు. ఈ వ్యాధి మనిషి నుంచి మనిషికి వ్యాపించదని తెలియజేశారు. ఈ వ్యాధి వచ్చినప్పుడు తీవ్రమైన తలనొప్పి, జ్వరం, ఒళ్లు నొప్పులు, శరీరంపై దద్దుర్లు, మైట్స్ కుట్టిన చోట నొక్కుబడినట్లు ఎర్రటి పుండ్లు ఏర్పడి నల్లటి పెచ్చుల తో కూడి ఉంటుందన్నారు. ఈ వ్యాధిని రక్త పరీక్ష చేయడం ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. ఈ వ్యాధికి సంబంధించి అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో ఉచితంగా చికిత్స అంజే స్తారని తెలిపారు. అలాగే ఎలుకలు, చుంచు ఎలుకలు సంచరించే ప్రాంతాలను మూసి వేయాలని, పొలాల్లో గడ్డి కోసే వారు చేతులకు గ్లౌజులు, కాళ్లకు రబ్బరు చెప్పులు ధరించ డం ద్వారా మైట్స్ కాటు నుంచి రక్షణ పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ ఆంజనేయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లీగ్ మ్యాచ్‌లో ధర్మవరం జట్టు విజయం

ధర్మవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో రూరల్ క్రికెట్ లీగ్ అండర్-16లో శనివారం జరిగిన మ్యాచ్‌లో ధర్మవరం జట్టు విజయం సాధించి నట్టు కోచ్ రాజశేఖర్ తెలిపారు. హిందూపురం, ధర్మవరం బాలికల జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 30 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 261 పరుగులు చేసింది. ధర్మవరం జట్టులో హస్మిత 111 బంతుల్లో 114, కె.బృంద 49 బంతుల్లో 54 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన హిందూపురం బాలికల జట్టు 73 పరుగులకే ఆలౌట్ అయింది. చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు, కార్యవర్గ బృందం క్రీడాకారులకు మధ్యాహ్నం భోజన సౌకర్యం ఏర్పాటుచేశారు. ప్లేయర్ ఆఫది మ్యాచ్ హస్మితకు షూ బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పది పరీక్షల మోడల్ పేపర్ల పంపిణీ


ధర్మవరంలో మోడల్ పేపర్లను అందజేసిన ఉపాధ్యాయులు

ధర్మవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నెలకొన్న పరీక్ష భయాన్ని పోగొట్టేందుకు పదో తరగతి పరీక్షా మోడల్ పేపర్లు ఎంతగానో ఉపయోగపడతాయని పాఠశాల హెచ్‌ఎం ఉమాపతి పేర్కొన్నారు. పట్టణంలోని శాంతినగర్ మున్సిపల్ ఉన్నతపాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 52 మంది విద్యార్థులకు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి ఆర్థిక సహకారంతో యూటీఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రామకృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు టీఎస్‌పల్లి, ధనియాన్‌చెరువు పాఠశాలల్లో శనివారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మోడల్ టెస్టు పేపర్ల పుస్తకాలను ఉచితంగా అందించారు. కదిరి నిమ్స్ ఆసుపత్రి ఎండీ బాదల్‌నిషార్, యాసీన్‌ఖాన్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ రూపొందించిన ఈ మోడల్ టెస్టు పేపర్ల పుస్తకాలను పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సాయివలి, ప్రదానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మోహన్ రెడ్డి, షామీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు వరం.. హార్వెస్టింగ్ యంత్రం

వ్యవసాయ కూలీల డిమాండ్‌తో అన్నదాతలు విలవిల

పంటల నూర్పిడి కోసం తంటాలు

యంత్రంతో గంట వ్యవధిలో ఎకరం పంట నూర్పిడి



మొక్కజొన్న పంటను కోస్తున్న హార్వెస్టింగ్ యంత్రం

చిలమత్తూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పంట పండినా, పంట పండక పోయినా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆరుగాళ్ల కష్టపడి పండించిన పంటను నూర్పిడి చేసుకొని ఇంటికి తీసుకురావడం గగనమవుతోంది. ఒక పక్క ఆగని వర్షాలతో పంటలను కోసుకోవడం కష్టంగా మారిన నేపథ్యంలో ఉన్నట్టుండి వ్యవసాయ కూలీల డిమాండ్ పెరిగిపోయింది. ఎప్పుడూ లేని విధంగా కూలీల ధరలు పెరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతుకొచ్చిన పంటను ఇంటికి ఎలా తీసుకురావాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో పంట నూర్పిడి యంత్రాలు రైతులకు వరంలా మారుతున్నాయి.

కూలీలకు పెరిగిన డిమాండ్

చెదురు ముదురు వర్షాలు కురుస్తుండటం, వ్యవసాయ కూలీలకు డిమాండ్ పెరగడంతో పంట కోతలకు కొంత బ్రేక్ పడింది. ఇప్పటికే ఖరీఫ్ ప్రారంభంలో సాగుచేసుకున్న మొక్కజొన్న ఇతర పంటల కోత చివరి దశకు చేరుకుంటున్నాయి. అక్కడక్కడ సాగుచేసిన వరి పంటలు కోతకు వచ్చాయి. దాంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. సాధారణ సమయాల్లో మహిళా కూలీలకు రోజు కూలీ రూ. 300, పురుషులకు రూ. 500 ఉండేది. అయితే ఒకేసారి పంట కోతలు జరుగుతుండటంతో మహిళా కూలీలకు రోజు కూలి రూ. 450లకు, పురుషుల కూలీ రూ. 700లకు పెరిగింది. దీంతో ఒక పక్క పెరిగిన కూలీలు భరించలేక, మరోపక్క పండిన పంటను సకాలంలో కోసుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పంట నూర్పిడి కోసం తంటాలు

పెరిగిన కూలీల ధరలతో రైతులు తంటాలు పడాల్సి వచ్చింది. ఈ తరుణంలో అధిక కూలీలు భరించలేక ఇంట్లో ఉన్న వారే పంటల కోతకు సిద్ధపడుతున్నారు. ఒకరిద్దరితో సాగు చేసిన పంటను సకాలంలో కోత కోసుకోలేకపోతున్నారు. దీంతో కొంత పంట పొలంలో, మరికొంత ఇంట్లో ఉండిపోతోంది.

ఊపిరి పీల్చుకుంటున్న రైతులు

కూలీల ధరలు పెరగడంతోపాటు పొలం పనులకు కూలీలు దొరకని పరిస్థితిలో తమిళనాడు నుంచి ఈ ప్రాంతానికి వచ్చిన హార్వెస్టింగ్ యంత్రం రైతులకు ఊపిరిపీల్చుకున్నట్లు అయ్యింది. ఈ యంత్రం మొక్కజొన్న, వరి పంటలను అతి సులవుగా, తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో నూర్పిడి చేస్తోంది. ఈ యంత్రంతో ఒక ఎకరం మొక్కజొన్న పొలాన్ని కేవలం గంట సమయంలో కోతకోయవచ్చు. ఏకంగా కంకి నుంచి గింజలను వేరుచేసి రైతులకు అందజేస్తుంది. దీంతో సరాసరి యంత్రం ఇచ్చిన గింజలను ఆరబెట్టుకొనేందుకు వీలవుతోంది. దీని ఖర్చు కూడా తక్కువగానే ఉంది. ఎకరం పొలం కోయడానికి రూ.3500గా ఉంది. దీంతో కూలీల ఖర్చు, సమయం వంటివి గమనిస్తే అన్నీ ఆదా అవుతున్నాయి. ఈ యంత్రాలు రైతులకు ఎంతో దోహదపడుతున్నాయి.

కూలీల కొరత



వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదు. వ్యవసాయ పనులు చేసే వారు తక్కువైపోయారు. దీంతో పంటల సాగు కష్టంగా మారింది. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు కూలీలు దొరక్కపోయినా ఇంట్లోవారే పనులు చేసుకునేవారు. ఇప్పుడు ఇంట్లో ఒకరిద్దరే ఉంటున్నాం. దీంతో తప్పనిసరిగా పంటల సాగులో కూలీలు అవసరమవుతున్నారు. పంట విత్తేసమయం, కోత సమయాల్లో కూలీల కొరత తీవ్రంగా ఉంటోంది. ఈ సమయాల్లో వ్యవసాయ యంత్రాలను వాడాల్సి వస్తోంది. యంత్రాలతో పనులు వేగంగా జరగడంతో పాటు కూలీలతో పనిలేకుండా పోతోంది. ఖర్చు కూడా తక్కువగానే ఉంది.

-గడ్డం కిష్టప్ప, చిన్నప్పరెడ్డిపల్లి

హార్వెస్టింగ్ యంత్రంతో ఊపిరి పీల్చుకున్నాం



నేను మొక్కజొన్న సాగుచేశాను. పంట కోతకు సిద్ధమయ్యాను. కూలీలు దొరకడం లేదు. ఈ సమయంలో గ్రామంలోకి పంటను కోసి నూర్పిడి చేసే హార్వెస్టింగ్ యంత్రం వచ్చింది. దీంతో ఆ యంత్రంతో పంటను తీయించాను. రెండు ఎకరాల పంటను కేవలం రెండు గంటల సమయంలో తీశారు. పంట కోసే పనే కాకాకుండా నూర్పిడి కూడా చేసింది. గింజలను ట్రాక్టర్లో తీసుకెళ్లి అరబెట్టుకోవడానికి సిద్ధంగా ఉంచింది. ఈ పని కూలీలతో చేస్తే మూడు రోజులు పట్టేది. యంత్రంతో రెండు గంటల్లో పూర్తయ్యింది. ఇటువంటి యంత్రాలను ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అందుబాటులో ఉంచితే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

- నందుకుమార్, దేమకేతేపల్లి



హిందూపురంలో నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు



పెనుకొండలో నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత

సంఘసంస్కర్త అంబేడ్కర్

కొనియాడిన వక్తలు..

అంబేడ్కర్ గొప్ప సంఘ సంస్కర్త అని పలువురు కొనియాడారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ అని పేర్కొన్నారు. దళితులు, అణగారిన వర్గాల కోసం పోరాడిన వ్యక్తి అని అన్నారు.



మడకశిరలో నివాళులు అర్పిస్తున్న గుండుమల

పెనుకొండ టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలో ఆయన విగ్రహానికి మంత్రి సవిత నివాళులు అర్పించారు. స్థానిక నాయకులతో కలిసి విగ్రహానికి పూలమాలలువేశారు. మంత్రి మాట్లాడుతూ ఆయన రాసిన రాజ్యాంగాన్ని దేశంలో అమలు పరుస్తున్నారని ఆయన ఎందరికో స్ఫూర్తిఅని కొనియాడారు.

హిందూపురం: బీఆర్ అంబేడ్కర్ గొప్ప సంఘసంస్కర్త అని టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య అన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజ్యాంగం రచించిన మహనీయుడన్నారు. దళితుల హక్కుల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. రాజ్యాంగం నిర్మించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. దేశానికి మొదటి న్యాయశాఖ మంత్రిగా పనిచేశారన్నారు. పేదవాడి తలరాతలు మార్చే విద్యతోనేనని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప విద్యావేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, పట్టణాధ్యక్షులు వెంకటేశ్, నాయకులు మంగేష్, నెట్టప్ప, అమర్నాథ్, హెచ్ఎన్ రాము, రవీంద్రనాయుడు, యుగందర్, డైమండ్‌బాబా, నవీన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పలు పార్టీల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అసమానతలు లేని సమాజానికి కృషి: గుండుమల

● **మడకశిరటౌన్:** అసమానతలు లేని సమాజం కోసం అంబేడ్కర్ కృషి చేశారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళిత బహుజన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, పట్టణ అధ్యక్షులు నాగరాజు, కౌన్సిలర్లు నాగేంద్ర, ఉమాశంకర్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా ఏపీఎస్‌టీఏ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు డి.మారుతీప్రసాద్, ఉపాధ్యాయ సంఘం నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, నరసింహప్ప నివాళులు అర్పించారు.

● **గోరంట్ల:** ఎంపీడీఓ కమలాబాయి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధి సిబ్బంది నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోముశేఖర్, ఎస్సీఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు ఉమాశంకర్, టీడీపీ నాయకులు మునిస్వామి, గిరిధర్‌గౌడ్, అజంతుల్లా, ఉమ్మర్‌ఖాన్, వేణుగోపాల్ ఉన్నారు.

రొద్దం: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. సీపీఐ బాబా, కాంగ్రెస్ నాయకుడు బాబు, గోనిమేకలపల్లి గోపాల్, దొడగట్ట గోపాల్ తదితరులు నివాళులు అర్పించారు.

అగళి: మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మడకశిర తాలూకా ఉపాధ్యక్షులు మల్లేష్, ఇరిగేపల్లి మాజీ సర్పంచ్ లింగన్న, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బూతరాజు, హనుమంతరాయ, నాగరాజుతోపాటు జడ్పీటీసీ ఉమేష్, శివన్న, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ కెంచుయాదవ్ పాల్గొన్నారు.

అమరాపురం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ స్మృతివనంలో ఎస్సీసెల్ కమిటీ నాయకులు వర్ధంతిని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పేదలపాలిట ఆశాజ్యోతి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో నారాయణమాదిగ, మాజీ ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, ఉదకూరు శివకుమార్, ఎస్సీసెల్ తాలూకా ఉపాధ్యక్షుడు బీటీ చెన్నప్ప, నాగరాజు పాల్గొన్నారు.

పరిగి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ వర్ధంతిని ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రామాంజినప్ప పాల్గొన్నారు.

రొళ్ల: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి దళితులు, టీడీపీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. దళిత, అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ కృషిచేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఈరన్న, వక్కళిగ సాధికార కన్వీనర్ పాండురంగప్ప, ఏపీఐఐసీ డైరెక్టర్ రామక్రిష్ణ, రంగస్వామి, కృష్ణమూర్తి, శ్రీనివాస్, నాగేంద్ర, మూర్తి పాల్గొన్నారు.

పావగడ: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో శనివారం అంబేడ్కర్ వర్ధంతిని దళిత సంఘాలు నిర్వహించాయి. దళిత నాయకులు ఆయనకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

చిలమత్తూరు: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని మండల కన్వీనర్ శ్రీనివాసులు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ పేర్కొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌరీశంకర్, చంద్ర, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

దీపిక సన్మాన సభను విజయవంతం చేయండి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మడకశిర ప్రాంతానికి పేరు ప్రతిష్ఠలు తెచ్చిన అంధుల క్రికెట్ కెప్టెన్ దీపిక సన్మాన బహిరంగ సభను ఈనెల 8వతేదీన నిర్వహిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు క్రికెట్ అసోసియేషన్ సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ తదితరుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలో జరిగే ఈ బహిరంగ సభ విజయవంతానికి క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, అర్బన్ సీఐ సుబ్రమ్మణ్యం, కమిషనర్ జగన్నాథ్‌తోపాటు పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి లక్ష పుష్పార్చన

ధర్మవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేశవనగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి విజయ్‌కుమార్, అయ్యప్ప మాలధారుల ఆధ్వర్యంలో శనివారం స్వామికి లక్ష పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సాగింది. పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన 600 మందికిపైగా కన్నెస్వాములచే ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు గురుస్వామి తెలిపారు.

రాచూరులో కనకదాస జయంతి



గొరవయ్యల నృత్యం తిలకిస్తున్న గ్రామస్థులు

రొద్దం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాచూరు గ్రామంలో కనకదాస జయంతి వేడుకలను శనివారం కురుబలు ఘనంగా నిర్వహించారు. మహిళలు కళశాలతో ఊరేగింపుగా వెళ్లి ఆంజనేయస్వామికి సమర్పించారు. అనంతరం కనకదాస చిత్రపటానికి పూజలు చేశారు. గొరవయ్యల నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో రామచంద్ర, నర్సింహారెడ్డి, అంజినరెడ్డి, పోతిరెడ్డి, వెంకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12న కలెక్టరేట్ వద్ద ఆందోళన: ఏఐటీయూసీ



ఐసీడీఎస్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల డిమాండ్లు పరిష్కరించాలని ఈనెల 12న కలెక్టరేట్‌వద్ద ఆందోళన చేస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు బండి ఆనంద్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం సీడీపీఓతో కలిసి అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ కలెక్టరేట్ వద్ద జరిగే కార్యక్రమానికి తరలిరావాలన్నారు. ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించాలని, లేదంటే పోరు ఆగదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి దేవి, చంద్రకళ, చలపతి, సిద్ధగిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

హిందూపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మరుగుదొడ్లు నిర్మించేందుకు స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున పరిశీలించారు. ఎంజీఎం క్రీడా మైదానంతోపాటు రహమత్‌పురం సచివాలయం, మున్సిపల్ కార్యాలయంలో అధునాతన మరుగుదొడ్లు నిర్మించేందుకు నిధులు వచ్చాయని, ఇందులో కేంద్రంవాటా 33శాతం, రాష్ట్రంవాటా 22శాతం, యుఎల్‌బిషేర్ 45శాతం ఉంటుందన్నారు. రూ. 44 లక్షలతో అధునాతన మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.

గుడిబండకు కృష్ణాజలాలు



కాలువలో ప్రవహిస్తున్న కృష్ణాజలాలు

గుడిబండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలు గుడిబండ మండలానికి చేరాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీం నారాచంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేష్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చొరవతో కృష్ణ జలాలు గుడిబండ మండలం మీదుగా అమరాపురం చెరువుకు కాలువ ద్వారా వెళ్తున్నాయని, వారికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

పరిగి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతిచెందిన భజంత్రి గోపాల్ కుటుంబ సభ్యులకు స్థానిక పాత్రికేయులు ఆర్థిక సాయం అందించి తోడుగా నిలిచారు. మండల కేంద్రంలో నివసిస్తున్న భజంత్రి గోపాల్(45) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. ఎనిమిదేళ్ల క్రితం ఆయన భార్య కూడా మృతిచెందడంతో ఇద్దరు కుమార్తె అనాథలయ్యారు. సమచారం తెలుసుకున్న పాత్రికేయులు వారి ఇంటికి వెళ్లి తమవంతుగా రూ. 10 వేలు ఆర్థికసాయాన్ని అందించారు.

వైభవంగా అంజన్నకు హారతి ఉత్సవాలు



అమరాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కళారాజనపల్లి గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో హారతి ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహానికి ఆలయ అర్చకులు తెల్లవారుజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం హోమాది కార్యక్రమాలను నిర్వహించారు. కళారాజనపల్లి గ్రామం నుంచి మహిళలు హారతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

రొద్దం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పెద్దిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఓబులప్ప(65)అనారోగ్యంతో మృతి చెందగా మంత్రి సవిత నివాళులు అర్పించారు. శనివారం రొద్దం మండల పరిధిలోని పెద్దిపల్లి గ్రామానికి వెళ్లి టీడీపీ కార్యకర్త మృతదేహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అధైర్యపడవద్దు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట టీడీపీ నాయకులు డీవీ ఆంజనేయులు, టైలర్ ఆంజనేయులు, బాబుల్‌రెడ్డి, కిష్టప్ప, అశ్వర్థరెడ్డి తదితరులు ఉన్నారు.

పెనుకొండ టౌన్: మంత్రి సవిత చొరవతో పెనుకొండ నియోజకవర్గంలోని నాలుగు పురాతన ఆలయాలకు మహర్దశ వచ్చింది. ఆలయాల అభివృద్ధికి రూ.5.27కోట్లు మంజూరయ్యాయి. ఈ క్రమంలో పెనుకొండ ఐముక్తేశ్వర స్వామి ఆలయానికి, కస్తూరి రంగనాథస్వామి ఆలయానికి, గోరంట్ల మండలం రాగిమాకులపల్లి అంజనేయస్వామి గంధ దేవత ఆలయాలకు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవితకు, దేవదాయశాఖమంత్రి ఆనం నారాయణరెడ్డిలకు ఆయా ప్రాంతవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమల పాదయాత్రికులకు నిత్యావసరాలు

చిలమత్తూరు, డిశంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతికి పాదయాత్ర చేస్తున్న యాత్రికులకు టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణయాదవ్ నిత్యావసరాలను అందజేశారు. పాదయాత్రగా వందలమంది శనివారం చిలమత్తూరు నుంచి తిరుమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారికి భోజనం కోసం అవసరమయ్యే నిత్యావసరాలను ఆయన అందజేశారు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య

హిందూపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కిరికెర సమీపంలో రైలుకిందపడి మోదాకు చెందిన నారాయణప్ప(70) ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వచ్చాక రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గూడ్స్ లోకోపైలెట్ అందించిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం వద్ద మొబైల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులుగుర్తించాక మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా అర్జున్‌నాయక్



హిందూపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా అర్జున్‌నాయక్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా ఎస్టీ మోర్చాలో అవకాశం కల్పించినందుకు రాష్ట్ర జిల్లా నాయకులకు అర్జున్‌నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

దేవుడి సేవకు సమయం కేటాయిద్దాం

మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి కొంత సమయాన్ని దేవుని సేవకు కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య అన్నారు. శనివారం పట్టణంలోని పేట వెంకటరమణస్వామి ఆలయం నుంచి పాదయాత్ర బృందం తిరుమలకు ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో ఏడు రోజులపాటు కాలినడకన తిరుమలకు చేరుకోనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, రూరల్ మండల కన్వీనర్ రాము, మంగేష్, నెట్టప్ప, ఎన్‌టీకే రాజు, అమర్నాథ్, బాచి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నం

సోమందేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నడిబొడ్డులో ఉన్న ఓ వైన్స్ షాపులో దొండగులు చోరీకి విఫలయత్నం చేశారు. శుక్రవారం రాత్రి బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్ తాళంపై పోసి నిప్పంటించారు. అయితే తాళం తెరుచుకోకపోవడంతో అక్కడి నుంచి ఉడాయించారు. ఈ సంఘటన షాపు సీసీటీవీలో రికార్డ్ అవ్వడంతో నిర్వాహకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రమేష్ దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ గ్రామంగా చిక్కతిమ్మనహట్టి

పావగడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని నిడిగల్ హోబళికి చెందిన చిక్కతిమ్మనహట్టి రెవెన్యూ గ్రామంగా రూపుదిద్దుకుంది. ఇందుకు విశేష కృషి చేసిన టీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ హరిరాంను శనివారం గ్రామస్థులు అభినందించారు.

'చేనేత కుటుంబాన్ని ఆదుకోవాలి'

సోమందేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతాళలేక ధర్మవరంలోని కొత్తపేట రాంనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు నీలూరి కృష్ణమూర్తి ఆత్మహత్య చేసుకున్నాడని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు శీల నారాయణస్వామి కోరారు. పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఆ కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు.

బాబయ్య దర్గాను దర్శించుకున్న ఎస్పీ

పెనుకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బాబయ్యస్వామి దర్గాను ఎస్పీ సతీష్ కుమార్ శనివారం రాత్రి దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గాకు వచ్చిన ఎస్పీకి దర్గా ముతవల్లి తాజ్‌బాబా, పీఠాధిపతి సలావుద్దీన్‌బాబా స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ చాదర్‌ను ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లి స్వామి సమాధికి సమర్పించారు. దీవాన్‌ఖానవద్ద ఎస్పీకి తాజ్‌బాబా పూలమాలలువేసి శాలువలు కప్పి సత్కరించారు. ఎస్పీ వెంట డీఎస్పీ నర్సింగప్ప, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.



చాదర్ తీసుకెళ్తున్న ఎస్పీ

ఉరుసు సందడి

పెనుకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిచెందిన బాబయ్యస్వామి దర్గా ఉరుసు ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు తరలి రావడంతో పెనుకొండలో సందడి నెలకొంది. ముఖద్వారంతోపాటు బాబయ్యదర్గా మొత్తం విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వచ్చిన భక్తుల కోసం దర్గా పక్కన ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదేవిధంగా అక్కడ ఏర్పాటు చేసిన గాజులు, ఇతర దుకాణాలు కొనుగోలుదారులతో కిటికిటలాడుతున్నాయి. భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన ఖవ్వాలి ఆకట్టుకుంది.



ఉరుసులో ఎగ్జిబిషన్

మాజీ సర్పంచ్ మృతి



జయలక్ష్మమ్మ

పెనుకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ జయలక్ష్మమ్మ (80) శనివారం బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతురాలు జయలక్ష్మమ్మ రిటైర్డ్ హెచ్ఎం. అనంతరం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం సరస్వతి విద్యామందిరం అభివృద్ధి కమిటీ సభ్యురాలుగా ఉన్నారు. రెండు నెలల క్రితం ఆమె సోదరుడు యాదవ సంఘం గౌరవాధ్యక్షుడు రాంప్రసాద్ మృతిచెందారు. ప్రస్తుతం జయలక్ష్మమ్మ మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలిసిన వెంటనే యాదవ సంఘం నాయకులు, పుర ప్రముఖులు ఆమె భౌతిక కాయాన్ని దర్శించి నివాళులు అర్పించారు.

ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఎర్రబల్లి గ్రామానికి చెందిన నారాయణప్ప జీవితంపై విరక్తితో శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పు అట్టించుకుని శుక్రవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తాగుడుకు బానిస కావడం, కుటుంబ సభ్యులు అతడి మాటలు వినికపోవడంతో జీవితంపై విరక్తితో ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గోరంట్ల ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం వెళ్లాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు.